

# డాన్ బోస్కో బాల విధానం మరియు అవశ్య నియమావళి

# Don Bosco Child Policy For Young at Risk (YaR)
# and
# Essential Protocols


## YaR FORUM INDIA

**DB National Forum For Young at Risk (YaR)**
Palam Gaon,
New Delhi - 110045, INDIA.
Ph: 011 25081014
E-Mail: yarindiaforum@gmail.com

**Don Bosco Navajeevan Bala Bhavan**
H.No. 6-2-323, New Bhoiguda
Secunderabad - 500 003
Ph: 040 - 27532497
E-Mail: yarforumhyd@gmail.com



# శిక్షలను గురించి ఒక మాట

శిక్షలు విధించడానికి అనుసరించ వలసి నియమాలు ఏమిటి? అన్నింటికన్నా ముందు అసలెప్పటికీ శిక్షలు విధించవద్దు. కాని, కఠిన చర్యలు తీసుకోవలసిన అవసరం వస్తే, ఈ క్రింద చెప్పబడిన అంశాలను మనస్సులో ఉంచుకోండి.

1. అధ్యాపకుడైన వ్యక్తి, తన విద్యార్థుల ప్రేమాభిమానాలను గెల్చుకో ప్రయత్నించాలి. అప్పుడే వారిలో భయాన్ని అతడు ప్రేరేపించగలడు. ఈ విషయంలో కృతార్థుడైతే, అతడు కనబర్చే ప్రేమపూర్వక దయా చిహ్నాన్ని కొంత అందించకుండా వెనుదీయడమే శిక్ష అవుతుంది. ఇది బాలలలో మనస్తాపాన్ని రేకెత్తిస్తుంది. ధైర్యపర్చుతుంది మరి ఎప్పటికీ తన క్రమశిక్షణా స్థాయిలోంచి దిగజారడు.

2. యువతలో శిక్ష అంటే ఏదైనా శిక్ష అవుతుంది. గమనించిన విషయం ఏమిటంటే, కొంతమంది బాలుర విషయంలో కోపంతో ఒక చూపు చాలు, ముఖం మీద కొట్టే చెంప దెబ్బకంటే ఎక్కువ ప్రభావం కలిగిస్తుంది. బాగా నిర్వహించిన పనిని మెచ్చుకోవడము, అజాగ్రత్తగా చేసే పనిని దిద్దడము, దీనినే బాలురు గౌరవంగాను, శిక్షగాను అనుకుంటారు.

3. చాల అరుదుగా తప్ప, దిద్దుబాట్లు, శిక్షలు ఎప్పటికీ బాహాటంగా చేయవద్దు. ఎల్లప్పడు వాటిని ఆంతరంగికంగా, సహచరులు లేనప్పుడు చేయాలి. కారణాలు మరియు నీతినియమాల వెలుగులో విద్యార్థి తన తప్పును తాను అంగీకరించగలిగేలా, గొప్ప వివేకమును ఓపికను  అవలంబించాలి.

4. ఏ విధంగానైనా బాలుణ్ని కొట్టడం, నొప్పికలిగించేలా మోకరిల్ల జేయడం, చెవులను మెలిబెట్టడం, అటువంటి తదితర శిక్షా పద్ధతులన్నింటిని బొత్తిగా మానుకోవాలి. కారణం, చట్టం వాటిని నిషేదిస్తుంది, అవి బాలురను మహా బాధిస్తాయి. మరియు పంతులు గారిని అవి కించపర్చుతాయి.

5. క్రమశిక్షణా చర్యలను, నియమావళి దండనలు అన్నింటినీ, విద్యార్థులకు తెలియజేయబడి ఉండేలా ప్రథమాచార్యులు జాగ్రత్త వహించాలి. అప్పుడిక ఎవ్వరూ, ఆదేశింపబడిన దానిని, నిషేధింపబడిన దానిని గూర్చి తనకు తెలియదని చెప్పజాలడు.

ఈ విధానాన్ని మన నిలయాల్లో అమలు జరపితే, మనకు మంచి ఫలితాలుంటాయని నేను నమ్ముతున్నాను. బెత్తము ఉపయోగించకుండానే, తదితర శారీరక శిక్షలను  విధించకుండానే సత్ఫలితాలను పొందగలమని నా విశ్వాసం. నలభై యేండ్లుగా నేను బాలురతో సహజీవనం చేస్తున్నప్పటికీ, ఏ విధమైన శిక్షలు విధించినట్టు నాకు జ్ఞాపకం లేదు. కాని దేవుని సహాయంతో ఎల్లప్పుడు నేను సత్ఫలితాలను పొందివున్నాను. అది మాత్రమే కాదు ఇలా చేస్తున్నప్పుడు విధి నిర్వాహణకు మాత్రమేకాదు, నా ప్రతియొక్క కోరికలను కూడ సంతోషముగా నేరవేరుస్తారు. దీని ద్వార విజయావకాశపు  నమ్మికలన్నీ కోల్పోయేలా కనబడుతున్న  ప్రతి బాలుర విషయంలోను మంచి ఫలితాలందుకొని వున్నాను.

# డాన్ బోస్కో బాల విధానం మరియు అవశ్య నియమావళి

## విషయ సూచిక


ముందుమాట

సమర్పణ

01. పరిచయం
02. విధాన దర్శనం (Vision)
03. విధాన సూత్రాలు
04. విధాన లక్ష్యాలు
05. విధాన అమలులో ప్రధాన అంశాలు
    - 5.1. బ్రతకు తెరువు
    - 5.2. అభివృద్ధి
    - 5.3. రక్షణ
        - 5.3.1. దుర్వినియోగం
        - 5.3.2. నిర్లక్ష్యం
        - 5.3.3. దోపిడి
        - 5.3.4. హింస
    - 5.4. పాల్గొనడం
06. సంస్థాగత నియమావళి
07. నియామకం, తర్ఫీదు సామర్థ్యాల పెంపుదల
08. సమాచార నిక్షిప్తం (Documentation), పరిశోధన
09. విధాన సమర్ధన (Advocacy)
10 . బాలలకు వ్యతిరేక ప్రవర్తనలు: ఫిర్యాదులు, ప్రతిస్పందనలు.
11. బాలల గురించి సమాచారాలు (Communication)
12. విధానం యొక్క పరిశీలన, సమీక్ష
13. ఈ పిల్లల విధానం ఎవరికి వర్తిస్తుంది?

**అనుబంధం:**

1. బాలలపై జరిగే తప్పులు గురించి ఫిర్యాదు పత్రం
   ఆరోపనపై విచారణకు విజ్ఞప్తి
2. బాలల విధానం పట్ల అంకిత ప్రకటన

## ప్రత్యేక అనుబంధం

పిల్లల దృష్టిలో పిల్లల విధానం

# ముందుమాట

భారత దేశానికి వచ్చినప్పటి నుండి సమస్యల్లో ఉన్న పిల్లల కొరకు డాన్‌బోస్కో సలేషియన్లు పనిచేస్తున్నారు. ప్రేమకు గుర్తుగాను, ప్రేమను సాధించే వారిగాను, దేవునిచే పంపబడిన వారిగాను. ప్రత్యేకముగా నిరుపేద బాలుర కొరకు, సమాజములో తిరస్కరింపబడిన పిల్లల కొరకు ఎక్కువశాతం డాన్‌బోస్కోసంస్థలు పనిచేస్తున్నాయి.

క్రమేణా, సమస్యల్లో ఉన్నబాలురు (Young at Risk) అనే పేరుతో ఈ పిల్లలను గుర్తించడం మొదలైంది. వారెవరనగా వీధిలో కనిపించే బాలురు, పని లేకుండా తిరిగే పిల్లలు, ఇంటినుండి ఇష్టం లేక బయటికి వచ్చిన పిల్లలు, అనాధలు, బాలకార్మికులు, చదువు మానివేసిన పిల్లలు, వలస కార్మికుల పిల్లలు, విపత్తుల కారణంగా సొంత వారి నుండి విచ్ఛిన్నమైన పిల్లలు – చివరకు సమాజంచే తిరస్కరింపబడి, సమాజం యొక్క అంచున జీవించే పిల్లలు.

ట్యూరిన్ నగరంలో 19వ శతాబ్దంలో డాన్‌బోస్కోగారు సమస్యల్లో ఉన్న ఇటువంటి పిల్లల కొరకు పాటుపడడమే తన జీవిత లక్ష్యంగా చేసుకున్నారు. సలేషియన్ సంస్థకు చెందిన వారు ఈ ఆదర్శానుసారంగా స్ఫూర్తితో పెద్ద ఎత్తున భారత దేశంలో పనిచేస్తున్నారు. పిల్లలకై పనిచేసే ఇతర సంస్థలతో అనుసంధానం ఏర్పరచుకొని ముందుకు సాగుతున్నారు. భారత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ రోజున డాన్ బోస్కో నిపుణుల సలహాలను పిల్లల మరియు యువత చట్టాల రూపకల్పనకై, సిడబ్ల్యుసిలాంటి సంస్థలకై మరియు ఇతర సందర్భాలలో స్వీకరిస్తున్నాయి. ఈ గుర్తింపు ఒక గౌరవంగాను పిల్లల కొరకు పనిచేయడానికి ఒక అవకాశంగాను భావిస్తున్నారు. డాన్‌బోస్కో స్పష్టతతో కూడిన, విస్తారమైన పిల్లల అధ్యయనవిధానాన్ని రూపొందించారు, దానికి Preventive System అని పేరు పెట్టారు. ఇక్కడ జరుగుతున్నది పిల్లలకు హాని కలుగకుండా వారిని రక్షించడం, కుటుంబ జీవితానికి అనుగుణంగా ప్రేమగల వాతావరణం సృష్టించడం. అప్పుడు పిల్లలు సహజంగా పరిపక్వత పొందిన సాటి మానవులుగా ఎదుగ కలుగుతారు.

ఒక వైపు పిల్లల్ని ఆపదలో పడకుండా చూడటం. మరోవైపు వారిని సృజనాత్మకంగాను, ఉత్తేజపరంగాను, ఎదుగుదలకు అవసరం కల్పించడం. ఇది ఒక్కదైవికమైనటువంటి జీవన విధానం కూడా. ఈ విధానం ద్వారా పిల్లలు తమ యొక్క జీవిత వుద్దేశంలో సఫలీకృతులౌతారు. అంతేకాక వారు మంచి పౌరులుగా ఎదిగి సమాజ మేలు, దేశ అభివృద్ధి కొరకు కృషి చేసే వారవుతారు.

ఈ బాల విధానంలో పెరిగిన వారే సలేషియన్లు.వారి మాతృకనుండి సలేషియన్ సంస్థలో ఈ విధానం ఎలా వర్తిస్తుందని సందర్శకులు త్వరగా గుర్తించగలరు. సలేషియన్ సంస్థలోని అన్ని కార్యములు పిల్లల శ్రేయస్సు కొరకే. పిల్లలు, పెద్దలు అందరూ ఒకేచోట ఉంటారు, కలిసి మెలిసి జీవిస్తారు, ఆడుకుంటారు, పాడుకుంటారు, చదువుకుంటారు, పనిచేస్తారు.

ప్రస్తుత బాలవిధానం సలేషియన్ సంస్థల యొక్క వారసత్వం. పిల్లలతో, పిల్లల కొరకు 150 సంవత్సారాల నుండి కూడా చేసిన కృషి ఫలితమే. పిల్లల కొరకు దేవునికి తమ జీవితాన్ని ప్రేమతో సమర్పించిన వారికి పిల్లలు వారి సంక్షేమం ఎల్లప్పుడూ కేంద్రబిందువుగా ఉంటుంది. దీనితో పాటు సమకాలిన అధ్యాయన శాస్త్రంతో ముడిపడిన పరిజ్ఞానవంతమైన వ్యవస్థ ఇది. జాతీయ, అంతర్జాతీయ చట్టాలు మరియు క్రైస్తవ విలువలను, పిల్లల హక్కులతోను ముడిపడినటువంటి వ్యవస్థ ఇది. ఈ వ్యవస్థలో పిల్లల సంక్షేమం, రక్షణ గురించి పెద్దలు కూడా అవగాహన పొందుతారు. ఈ బాల విధానం పెద్దలకు ఒక మార్గదర్శి.

ఇపుడు మీ చేతిలో ఉన్నటువంటి ఈ బాల విధానం కొన్ని సంవత్సరాల కృషి ఫలితం. నైపుణ్యం మరియు అనుభవం కలవారు కలసి రూపొందించబడినది. సమావేశాలు, అధ్యయనాలు, సమీక్షలు, అభిప్రాయాల సేకరణల ద్వారా తయారు చేయబడినది. దక్షిణ ఆసియా సలేషియన్ ప్రొవిన్షియల్స్ బృందం వారు అంగీకరించిన విధానం ఇది. ఇప్పటి వరకు ఆచరణలో ఉన్నటువంటి ఈ విధానం ఇప్పుడు అధికార పూర్వకముగా రూపొందించడం జరిగినది. ఇది మొట్ట మొదటి అదికారపూర్వకంగా తయారు చేయబడిన పత్రం, ఇది తయారు చేసిన ఫా॥ మాత్యు తోమాస్ గారికి ఆయన జాతీయ స్థాయి బృందానికి మరియు దీనికి తోడ్పడిన వారందరికి నాయొక్క ప్రత్యేకమైన వందనములు. సలేషియన్ ప్రొవిన్షియల్స్ బృందం యొక్క అధికారపూర్వక అనుమతి లభించడం ద్వారా ప్రత్యేకతను పొందినది. దేవుని పేరిట పిల్లల కోసం పని చేసే ప్రతి ఒక్కరికి ఇది ఒక ప్రేరణగా ఉండాలి.

యేసుక్రీస్తుకు పిల్లలంటే చాలా ఇష్టం. వారితో ఎక్కువ సమయం గడిపారు, ఆడుకున్నారు, వారి మాటలు విన్నారు, వారికి నేర్పారు, వారి నుండి నేర్చుకున్నారు. మత స్థాపకులలో పిల్లల మనస్తత్వం కలిగి పిల్లలను కేంద్రబిందువులుగా చేసిన వ్యక్తి యేసుస్వామి. ఆయన దేవుని బిడ్డ, దేవుడు తనకు తండ్రి. చిన్నపిల్లల వలె రూపొందింతే తప్ప మనం దేవుని రాజ్యములో ప్రవేశింపలేము. దేవుని రాజ్యం అటువంటి వారిది. పిల్లల్ని దుర్వినియోగ పరచే వారికి అనర్ధం. అటువంటి వారిని అయన అతి తీవ్రముగా ఖండిస్తున్నారు. అటువంటి వారి మెడకు ఒక తిరుగటి రాయి కట్టి నడి సముద్రంలో ముంచడం మేలు. చిన్నపిల్లలు దేవుని పోలికలో ఉన్నవారు. యేసుప్రభువు గురించి ఈ అవగాహనతో డాన్‌బోస్కో పిల్లల్ని ప్రేమించే వ్యక్తిగా రూపొందినారు. తన జీవిత సర్వము పిల్లలకు అర్పించి త్యాగం చేసినారు. ఈ పిల్లల విధానానికి మూలం డాన్‌బోస్కో యేసు ప్రభుని అర్ధం చేసుకునే తీరు. ఇది పిల్లల గురించి ఆలోచనకు, సేవలకు ఒక మార్గదర్శిగా ఉంటుంది. పిల్లల కోసం పని చేసే ప్రతీ ఒక్కరు ఈ విధానాన్ని హృదయ పూర్వకముగా ఆచరిస్తారని నేను ఆశిస్తున్నాను.

**ఫాదర్ మరియ ఆరోకియం కనగ** (SDB)
డాన్‌బోస్కో సలేషియన్ సంఘానికి జనరల్ కౌన్సిలర్,
దక్షిణాసియా రీజనల్ అధికారి,
మరియు SPCSA అధ్యక్షులు.

# సమర్పణ

సమస్యలలో ఉన్నపిల్లల కొరకు డాన్‌బోస్కో జాతీయ పోరం (Don Bosco National YaR Forum): ఇది సమస్యలలో ఉన్న పిల్లల సంక్షేమం మరియు సంరక్షణ కొరకు పని చేస్తున్న సంస్థల యొక్క జాతీయ అనుసంధానం. దోపిడికి, వెలివేతకు, పేదరికానికి, కష్టాలకు, దౌర్జన్యానికి గురియై సమాజం యొక్క అంచున జీవిస్తున్న పిల్లలకు ఈ సంస్థలు అత్యవసర సహాయాన్ని అందిస్తున్నాయి. ప్రస్తుత మరియు దీర్ఘకాలిక సహాయ సహకారాలు వారికి అందిస్తున్నారు.

యార్ అంటే మిత్రుడు. యార్ అనుసంధాన సభ్యులు సమస్యలలో ఉన్న పిల్లలలకు మిత్రులుగా ఉంటారని ఆశిస్తున్నారు. ఈ పిల్లలందరూ యార్ అందిస్తున్న సేవలను అందుకోగలుగుతారని, ఇక్కడ ఉన్న స్నేహ పూరితమైన వాతావారణాన్ని అనుభవిస్తారని, రక్షణ పొందుతారని కోరుచున్నాను.

ఈ ప్రత్యేక స్నేహపూరిత వాతావరణం, ఇక్కడ అమలు పరిచేటువంటి సంరక్షణ మార్గాలు యార్ అనుసంధానం యొక్క గుర్తింపు. యువకుల మిత్రుడైన డాన్‌బోస్కోగారి నుండి వారు పొందిన వారసత్వము డాన్‌బోస్కో యొక్క విధానం. ఇది మూడు అంశాలపై ఆదారపడి ఉంది: అర్ధం చేసుకోవడం, దయాపూర్వక ప్రేమ, ఆధ్యాత్మికత.

యార్ అనుసంధానం పిల్లల సంరక్షణలో పాటించే కొన్ని ముఖ్యమైన సూత్రాలు:

1 గౌరవం, స్వేచ్ఛ మరియు మానవత్వంలో ఎదగడానికి పిల్లలతో పాటు పయనించడం.

2. సమాజం అంచున ఉన్న పిల్లలకు దోపిడి వ్యవస్థను శక్తి వంతముగా అధిగమించడానికి తోడ్పడే ఒక అనుకూల వాతావరణం.

3. హక్కుల దృక్పథంతో పాలుపంచుకుంటూ జీవించడానికి, గౌరవప్రదంగా ఎదగడానికి అవకాశలు, మార్గాలు కల్పించడం.

యార్ అనుసంధానములో ఉన్న ప్రతి సంస్థకు సమస్యలలో ఉన్న పిల్లల కొరకు అంకిత భావంతో పనిచేసే ఒక ప్రత్యేక చరిత్ర ఉంది. ఈ సంస్థలు దేశంలో పలుప్రాంతాలలో పనిచేస్తున్నాయి. ఒక్కొక్క ప్రాంతంలో ఆయా ప్రాంతాల సమస్యలకు అనుగుణంగా పనిచేస్తున్నాయి. అయినప్పటికి అందరూ కూడా ఒకే భావంతో పనిచేస్తున్నారు. అదే ఈ యార్ పిల్లల విధానం. ఈ విధానంలో పిల్లల కొరకు ఏ విధంగా పనిచేయాలో తెలుపబడింది.

మొట్టమొదటిగా జాతీయ స్థాయిలో అభిప్రాయ సేకరణ జరిగింది. దీనిలోని అంశాలు ఒక ముసాయిదా విధానంగా తయారు చేసారు. ఇది చెన్నైలో మార్చి 2011 లో జరిగిన యార్ వార్షిక సదస్సులో ఆమోదం పొందినది. ఆ తరువాత దక్షిణ ఆసియా సలేషియన్ ప్రొవిన్షియల్స్ సభలో అధికార పూర్వకంగా అంగీకారం పొందింది. ఒక సంవత్సరం దీనిని పలు ప్రాంతాలలో అమలుపరచిన పిదప దీనిని ముద్రించడం జరిగినది. ఈ కాలంలో యార్ అనుసంధాన సభ్యత్వం గల సంస్థలలో పని చేస్తున్న పెద్దలందరు ఈ విధానంలో తర్ఫీదు పొందారు. దీనికి తమ అంకిత భావాన్ని తెలుపుతూ సంతకాలు చేసారు.

యార్ బాల విధానం చాలా కాలం ఆలోచనల, ఆచరణల ఫలితమే. ఈ బాల విధానం తయారు చేయడానికి తోడ్పడిన చాలా వ్యక్తులను గుర్తించాలని నేను అనుకుంటున్నాను. యార్ అనుసంధాన సభ్యులు వారి యొక్క బాలవిధానాల్ని మాతో పంచుకున్నారు. సమావేశాల్లో చాలా మంది వారి యొక్క అభిప్రాయాల్ని వ్యక్తపరచారు. యార్ బాల విధాన సమావేశానికి ఫా॥

కురియాకోస్ పల్లికున్నేల్ నేత్రుత్వం వహించారు. ఈ విధానం యొక్క అంశాలు భాషా, కొలమానం, న్యాయబద్ధత మొదలైనవి పరిశీలించిన నిపుణులు: యూనిసెఫ్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శ్రీ సోనికుట్టిజార్జ్, IACR డైరెక్టర్ కు॥రజియా ఇస్మాయేల్, ఫా॥ జోస్ కుట్టియానిమట్టత్తిల్, ఫా॥ డామినిక్ వెలియెత్ మరియు ఫా॥ టి.డి. జాన్.

ప్రపంచ వ్యాప్తంగా పిల్లల కోసం పనిచేస్తున్న పలు సంస్థలు వారి యొక్క విధానాలు, ఆచారాలు మాతో పంచుకొన్నారు. బోస్కోనెట్(Bosconet), డాన్‌బోస్కోమోన్‌దో ( Don Bosco Mondo) మరియు ASMOAF వారు ఈ ప్రచురణకు ఆర్థికంగా తోడ్పడ్డారు.

ఈ విధానం డాన్‌బోస్కో జాతీయ యార్ అనుసంధాన సభ్యులకు వర్తిస్తుంది. ఐదు సంవత్సరాల తరువాత ఈ విధానాన్ని పున:పరిశీలన చేస్తారు.

యార్ అనుసంధాన సభ్యుల భాగస్వామ్యం మరియు సహకారంతో ఈ బాలవిధానాన్ని తయారు చేశారు. ప్రతీ ఒక్కరు ఈ విధానాన్ని గూర్చి గర్వించగలరు. ఈ విధానాన్ని పాటించి దీనిలో గల సవాళ్ళలను అమలు పరచినప్పుడు ఈ విధానాన్ని స్వంతం చేసుకొన్న వారు అవుతారు. ఈ విధానాన్ని ప్రతి ఒక్కరు దాని యొక్క నిజభావమును అర్థం చేసుకొంటూ దీని అమలు కోసం వారి జీవితం అంకితం చేయాలి – సమాజంలో వెలివేయబడి కష్టపడుచున్న భారతదేశపు పిల్లలకు జీవితం ఉండాలని, అది సమృద్ధిగా ఉండాలని (యోహాను 10:10) అది ఒక గౌరవప్రదమైన జీవితం కావాలని!

**రెవ. ఫాదర్ మాత్యు తోమాస్**
కార్యదర్శి మరియు నిర్వాహక అధికారి
సమస్యల్లో ఉన్న పిల్లలకు డాన్‌బోస్కో జాతీయ అనుసంధానం.

# డాన్ బోస్కో బాల విధానం మరియు అవశ్యనియమావళి

## 1. పరిచయం.

"వారికీ జీవితం ఉండాలని, పరిపూర్ణమైన జీవితం ఉండాలని వచ్చాను..." (జాన్ 10:10). యార్ ఫోరం (Don Bosco National Forum for Young at Risk) సమస్యలలో ఉన్న బాలల కోసం పనిచేసేవారికి, యేసుప్రభు మాటలు స్ఫూర్తినిస్తుంది. సంఘంలో బలహీనులు, అట్టడుగున ఉన్నవారికి జీవితాన్ని ఇవ్వడమే తన జీవిత ఉద్దేశ్యము. సలేషియన్ ఉద్యమ యువత స్థాపకుడు డాన్‌బోస్కో తన జీవిత కాలమంతా అట్టడుగున ఉన్నబాలల అభివృద్ధి కోసం కృషిచేశారు. "మీరు బాలలు అయితే చాలు నేను మిమ్మల్ని మరింత ప్రేమించడానికి..." అని డాన్‌బాస్కో చెప్పేవారు. బలహీనులైన బాలల పట్ల డాన్‌బోస్కోకి ఉన్న ఆపేక్షను ప్రేరణగా తీసుకుని యార్ ఫోరం వారికి సేవలు అందిస్తోంది.

సమస్యలలో ఉన్న బాలల కోసం పనిచేస్తున్న సెలేషియన్స్ మధ్య పరస్పర సహకారం, సమన్వయం పెంపొందించడం కోసం డాన్‌బోస్కో జాతీయ యార్‌ఫోరం స్థాపింపబడింది. సమస్యలలో ఉన్న బాలల పట్ల సహృద్భావం కలిగిన వ్యక్తులను, సంస్థలను అనుసంధానించడం, ఈ బాలలకు అనువుగా పాలసీలు రూపొందేలా ప్రభావితం చేయడం ఈ ఫోరం ప్రధాన లక్ష్యాలు. యార్ బాలల విధానాన్నిపై మార్గదర్శక సూత్రాలను ప్రాతిపదికగా తీసుకుని రూపొందించడం జరిగింది. "మేము సమస్యలకి మూలం కాదు; వాటిని పరిష్కరించేందుకు అవసరమయ్యే వనరులం ; ఖర్చులం కాదు, మేము పెట్టుబడి; కేవలం పిల్లలం కాదు, మేము ప్రపంచ పౌరులం; మీరు మమ్మల్ని భవిష్యత్తు అని పిలుస్తారు; కాని మేము ప్రస్తుతం కూడా" అని ప్రకటించిన ప్రపంచ బాలల స్వరాలు ప్రతిధ్వనించే విధానం ఇది. (ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ బాలల కోసం మే 8, 2002న నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ప్రపంచ నాయకులకు బాలలు అందించిన సందేశం).

మానవ జాతికి బాలలు వెలలేని సంపద. కనుక వారికి సమగ్ర ఆలనాపాలన, సంరక్షణ అందించాలి వారు పెరిగి పెద్దయ్యాక శారీరక సామర్థ్యం, మానసిక చురుకుదనం, నైతికవిలువలు, అత్యవసర జీవన నైపుణ్యాలు మరియు పరోపకారధోరణీ కలిగిన వ్యక్తులుగా రూపొందాలి. భారత రాజ్యాంగం, అంతర్జాతీయ బాలల హక్కుల తీర్మానం, జువినైల్ జస్టిస్ యాక్ట్ మరియు డాన్‌బోస్కో అధ్యాయన విధానం పేర్కొన్న విధంగా బాలల హక్కుల ప్రాధాన్యతను పెంచుటకు, పరిరక్షించుటకు యార్‌ఫోరం కృత నిశ్చయంతో ఉంది. ఇలా బాలలందరికీ బ్రతుకుతెరువు అభివృద్ధి, సంరక్షణ, పాల్పంచుకోవడం అని హక్కులు, అత్యున్నత కొలమానంతోను, సమానత్వంతోను వారికి అందించడం. యార్ ఫోరం ధృడ సంకల్పం. ఈ క్రింద పేర్కొన్న బాలల విధానం మరియు మార్గదర్శక సూత్రాలు బాలలను మరియు యువతను ఉద్దేశించినవి. వీరు "సమాజంలో సమస్యలకి గురయ్యే అవకాశమున్నప్పటికీ కూడా గొప్పస్థాయికి ఎదగ కలిగే వారు" అని డాన్‌బోస్కో గారు చెప్పేవారు. ఇటువంటి ఒక సురక్షితమైన పర్యావరణానికి, బాలల పరిపూర్ణ అభివృద్ధికి మరియు జీవనానికి ఇది ఒక మార్గదర్శక సూత్రం.

యార్ బాలల విధానం సమస్యలలో ఉన్న బాలలకు, అంటే 18 సంవత్సరాల లోపు వారందరికి సంరక్షణ కల్పించటానికే. పేదరికం, కష్టాలు, అణచివేత, దోపిడి, సమాజ అంచునకు నెట్టివేయబడడం, తీవ్రమైన స్థాయిలో పెరుగుతున్నాయి. సమస్యలలో ఉన్న బాలల్ని సంరక్షించుటలో మన వ్యవస్థలు, ప్రణాళికలు, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు సరిగా అమలవడం లేదన్నది వాస్తవం. ఈ

పరిస్థితుల్ని మౌన ప్రేక్షకుల్లా వీక్షించలేము. యార్ ఫోరం బాలల కనీస అవసరాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తుంది. ఈ క్రింద పేర్కొన్న అత్యంత బలహీన వర్గాలకు చెందిన బాలల తరపున, వారిపట్ల నిర్లక్ష్యం వహిస్తున్న ప్రభుత్వాన్ని చైతన్యవంతం చేసే దిశగా ప్రభావితం (Advocacy) చేస్తుంది.

వీధి బాలలు, బాలలు, బాల కార్మికులు, వదిలివేయబడ్డ అనాథలు, చట్టవ్యతిరేకంగా వ్యవహరించే బాలలు, వికలాంగ బాలలు, పారిపోయిన బాలలు, విచ్ఛిన్న కుటుంబాలకు చెందిన బాలలు, సంస్థీకృతమైన బాలలు, మాదక ద్రవ్యాలు/మత్తు పదార్థాలకు అలవాటు పడినవారు, యుద్ధం మరియు సంఘర్షణ పూరితమైన ప్రదేశాల్లో నివశిస్తున్న బాలలు. వ్యభిచార వర్తకంలో ఉన్న పిల్లలు, హెచ్.ఐ.వి మరియు ఎయిడ్స్ వచ్చిన పిల్లలు, చదువుమానేసిన బాలలు (డ్రాప్ అవుట్స్), అక్రమ రవాణాకు గురి అయినవారు, గురైయే అపాయ పరిస్థితిలో ఉన్న బాలలు, ఇతరత్రా ఆపదలకు గురయ్యే పరిస్థితుల్లో ఉన్న బాలల తరపున యార్ ఫోరం పనిచేస్తుంది.

యార్ పిల్లల విధానం సంక్షేమం మరియు అవసరాన్ని మాత్రం చూడకుండా హక్కులు మరియు న్యాయం ప్రతిబింబిస్తున్న ఒక సరికొత్త విధానం. బాలల ఆత్మగౌరవం, సంక్షేమం, భవిష్యత్తుకు సంబంధించిన విషయాలలో బాలలు భాగస్వాములై వారి స్వరాల్ని వినిపించాలని ఈ బాలల విధానం రేఖారూపాన్ని ఇస్తుంది. వ్యక్తిగత మరియు సమాజ స్థాయిల్లో బాలలకు సంరక్షణ, సాధికారత కల్పించేందుకు ఒక వేదికగా నిలుస్తుంది. ఏ మతం, కులం, లింగం, ప్రాంతానికి చెందిన పిల్లలైన వారియొక్క వ్యక్తిత్వం మరియు ప్రతిభ ప్రత్యేకంగా గుర్తించడానికి చొరవ తీసుకుంటారు. యార్ ఫోరంలో ఉన్న ప్రతి ఒక్కరు వ్యక్తపరచే ఉద్ధేశమును మరియు అంకిత భావమును ఈ విధానం పూర్తిగా ప్రకటిస్తుంది " ఈ యార్ ఫోరం సభ్యులందరు కూడా ఈ విధానంలో చెప్పబడినటువంటి నియమాలు ఉద్ధేశాలు మరియు ప్రాధాన్యతలను అనుసరించి పని చేయడానికి బద్ధులై ఉన్నారు. ఈ యార్ ఫోరం మరియు దాని సభ్యులందరు కూడా తగిన వనరులను వినియోగించి ఈ విధానాన్ని ఫలప్రదంగా ఆచరించుటకు అంకితమై ఉన్నారు.

## 2. విధాన దర్శనం

సమస్యలలో ఉన్న పిల్లలకు డాన్‌బోస్కో జాతీయ ఫోరం ప్రభుత్వం, ప్రభుత్వేతర సంస్థలు, బాలల కుటుంబాలతో కలిసి సమన్వయంతో ప్రతి ఒక్క బాలలను పోషించే, గౌరవించే, సంరక్షించే వాతావరణం అందించేందుకు కృషిచేస్తుంది. అదే విధముగా పిల్లలందరికి వారి బ్రతుకు, రక్షణ, అభివృద్ధి కలిగే విధముగా వారికి హక్కులు అవకాశాలు, వనరులు కల్పించి ఆనందదాయకమైన బాల్యాన్ని మరియు ఉజ్వల భవిష్యత్తును హామి ఇవ్వడం యార్ ఫోరం యొక్క దృక్పధం.

## 3. విధాన సూత్రాలు

3.1. భారత రాజ్యాంగం ఈ దేశ పౌరులందరికీ (బాలలతో సహ) హక్కుల్ని అందించింది. బాలలందరికీ సమాన హక్కులు ఉన్నాయి; వర్గ, మూల, సంప్రదాయ, ఆచరణ, సంస్కృతి లేదా మతపరమైన వ్యవహారాలు మరియు అభ్యాసాలు ఏవైనా బాలల్ని వారి హక్కులు పొందకుండా నిరోధించడంగాని, ఉల్లంఘించడంగాని, చేయరాదు.

3.2. బాలల హక్కులు సార్వజనీయమైనవి, పరస్పర సంబంధమైనవి, పరస్పర ఆధారమైనవి, విడగొట్టలేనివి, విడదీయరానివి.

3.3. బాలలకు సంబంధించిన లేదా వారిని ప్రభావితం చేసే అన్ని చర్యల్లో ఆయా బాలలకు అత్యంత ప్రయోజనం కలిగించే అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలి.

3.4. బాలలకు రక్షణ పొందే హక్కు ఉంది. వివక్ష, దుర్వినియోగం, నిర్లక్ష్యం, దోపిడి, హింసల నుండి వారికి రక్షణ కల్పించాలి.బాలల రక్షణ అవసరాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి. వారికి అన్ని రకాల హానికర అంశాలు, వివక్షలు, నిర్లక్ష్యాలు, దుర్వినియోగాలు, హింసల నుండి రక్షణ పొందే హక్కు ఉంది.

3.5. బాలల శారీరక, సామాజిక, మానసిక, భావపర, మేధోయుత, నైతిక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక అభివృద్ధి అంశాలను పరిపూర్ణంగా గుర్తించాలి.

3.6. బాలల సర్వతోన్నత అభివృద్ధికి కుటుంబం దోహదం చేస్తుంది. కనుక కుటుంబానికి దూరమైన బాలలు లేదా కుటుంబ తరహా ప్రత్యామ్నాయ ఆవాసం కల్పించడానికి అవకాశం లేని బాలల్ని మాత్రమే సంస్థల్లో ఉంచడం జరగాలి. ఈ విధంగా సంస్థల్లో ఉంటున్న బాలల్ని తిరిగి కుటుంబం దగ్గరికి చేర్చడం లేదా కుటుంబ తరహా ప్రత్యామ్నాయ ఆవాసాన్ని కల్పించడానికి చర్యలు తీసుకోవాలి.

3.7. బాలల కోసం చేపట్టే చర్యలన్నీ సమానత్వం, సమన్యాయం, వివక్షరహిత విధానాల ప్రాతిపదికగా ఉండాలి.

3.8. బాలలకు సంబంధించిన కార్యక్రమాలు నిర్వహించే సందర్భాల్లో వారి వ్యక్తిత్వం, వయస్సు, లింగం, వారి ప్రత్యేక అవసరాలు, స్థితిగతులను దృష్టిలో ఉంచుకోవాలి.

3.9. బాలలకు సంబంధించిన అన్ని అంశాల్లో వారిని సంప్రదించడం, తగిన భాగస్వామ్యం కల్పించడంలో వారి వయస్సుని పరిగణనలోకి తీసుకొని అందుకు తగిన విధంగా చర్యలు తీసుకోవాలి. బాలలకు సంబంధించిన అన్ని వ్యవహారాల్లో వారి సంపూర్ణ హక్కుల్ని గౌరవించాలి.

3.10. బాలల సంరక్షణకి సంబంధించిన ప్రాథమిక బాధ్యత ప్రభుత్వంపై ఉంది. బాలల సంక్షేమ కార్యక్రమాల అమలులో బాలల హక్కుల ప్రాతిపదికన చర్యలు చేపట్టాలి. బాల విధానం (ఛైల్డ్ పాలసీ) లో పేర్కొన్న అంశాలు, ప్రమాణాలకు అనుగుణంగా యార్ ఫోరం బాలల రక్షణ, సంరక్షణకు సంబంధించిన సంక్షేమ పథకాలు, పాలసీలు, చట్టాల అమలులో ప్రభుత్వంతో కలిసి పనిచేస్తుంది.

3.11. బాలలకు చెందిన సమాచారాన్ని ముద్రించడం, ఏ రూపంలోనైనా వారిని చిత్రీకరించడం అన్నది ఆయా బాలల వ్యక్తిగత జీవనానికి, హుందాతనానికి, వారి అత్యున్నత ప్రయోజనాలకు భంగకరం కాని విధంగా ఉండాలి.

3.12. తమ అభివృద్ధికి, సంక్షేమానికి సంబంధించిన సమాచారాన్ని పొందే హక్కు బాలలకు ఉంది. ముఖ్యంగా బలహీన, ప్రాంతీయ వర్గాలకు చెందిన బాలలకు వారికి అర్థమైన, సులభమైన భాషలో సమాచారం అందించాలి. బాలల ఎదుగుదలకు, అభివృద్ధికి తగిన సమాచార సాధనాలు, పిల్లల పుస్తకాలు వారికి అందుబాటులోకి తేవాలి.

3.13. బాలల సమగ్ర అభివృద్ధికి, సంక్షేమానికి తోడ్పడే కార్యక్రమాల అమలులో యార్ఫోరం తమ నిరోధ వ్యవస్థ (ప్రివెంటివ్ సిస్టమ్)లో పొందుపరిచిన "కారణం (రీజన్), మతం (రెలీజియన్), మరియు ప్రేమతో కూడిన దయ (లవింగ్ కైండ్నెస్)" అంశాల ప్రాతిపదికన పనిచేస్తుంది.

3.14. భారత రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కులు, ఆదేశాలు, అంతర్జాతీయ బాలల హక్కుల తీర్మానంలోని ప్రమాణాలు, జువనైల్ జస్టిస్ యాక్ట్లో పేర్కొన్న న్యాయ నిర్దేశాలు, ఇతర సంబంధిత న్యాయ విధానాలు, డాన్బోస్కో నిరోధ వ్యవస్థ (ప్రివెంటివ్ సిస్టమ్) స్ఫూర్తిని ప్రాతిపదికగా తీసుకుని యార్ ఫోరం ప్రభుత్వ ప్రభుత్వేతర సంస్థలు/రంగాలలో బాలలకు సురక్షితమైన వాతావరణం కల్పించడానికి కృషి చేస్తుంది.

# 4. విధాన లక్ష్యాలు

యార్ ఫోరం బాలలందరిపట్ల బాధ్యతగా వ్యవహరిస్తూ తన సేవలు, సహాయ కార్యకలాపాలు నిర్వహిస్తుంది.

4.1 నిరోధించదగ్గ కారణాల మూలంగా పోషకాహారలోపం, వ్యాధులకు గురికావడం, వికలాంగులు అవ్వడం, మరణం సంభవించడం వంటి అవాంఛనీయ పరిస్థితులు తలెత్తకుండా బాలల జీవనం, ఆరోగ్యం, సంరక్షణ, పోషకాహారం, పరిశుభ్రమైన తాగునీరు, పరిసరాలు వారికి అందుబాటులోకి తేవడం.

4.2 బాలల సంపూర్ణ ఎదుగుదలకు తోడ్పడేలా తగిన ప్రమాణాలతో కూడిన మానవ, మౌలిక వనరుల సముపార్జన.

4.3 బలమైన నిరోధ విధానాలు, ప్రచార తోడ్పాటు (అడ్వొకసీ), శిక్షాస్మృతులు, సంస్థలు, కొనసాగింపు చర్యలు, అమలు వ్యవస్థలతో బాలల సంరక్షణకు దోహదంచేసే సంరక్షణ వలయాన్ని సమన్వయపరుస్తూ బాలల పరిపూర్ణ సంరక్షణ సాధించే దిశగా ప్రభుత్వ పాలనలో జవాబుదారీతనాన్ని పెంచడం.

4.4 బాలలకు చెందిన అంశాల్లో నిర్ణయం తీసుకునేటప్పుడు వారి ఆకాంక్షలను పరిగణనలోకి తీసుకునే వాతావరణాన్ని కల్పించడం.

4.5 అంతర్జాతీయ, జాతీయ, ప్రాంతీయ స్థాయిల్లోని ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు/రంగాలను బాలల సంరక్షణ, హక్కుల దిశగా కృషి చేసేలా సమన్వయపరుస్తూ, సంప్రదింపులు జరుపుతూ అనుసంధాన (నెట్‌వర్క్) ఏర్పాటు.

4.6 బాలల హక్కులు, ఉల్లంఘనల పట్ల బాలలు, ప్రజల్లో అవగాహన/జ్ఞానం, సరైన ప్రవర్తన, అభ్యాసం పెంపొందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవడం, బాలల హక్కుల ఉల్లంఘన జరిగిన /జరగనున్న సందర్భాల్లో ఏవిధమైన రక్షణ, సహాయక చర్యలు అందుబాటులో ఉన్నాయో తెలియజేయడం.

4.7 నిరోధ వ్యవస్థ (ప్రివెంటివ్ సిస్టమ్) లేదా "పెడగోజీ ఆఫ్ ప్రెజెన్స్" లో పేర్కొన్న "కారణం (రీజన్), మతం (రిలీజియన్), మరియు ప్రేమతో కూడిన దయ (లవింగ్ కైండ్‌నెస్)" అన్న అంశాలను పరిగణలోనికి తీసుకుని బాలల పరిపూర్ణ వికాసానికి కృషిచేస్తారు. బాలలకు హాని కలిగించే విషయాలను నిరోధిస్తూ ; వారి రక్షణకు, సమగ్ర అభివృద్ధికి అనువైన వాతావరణాన్ని కల్పించడం, బాలల హక్కులను పరిరక్షణ సంస్కృతిని ప్రోత్సహించడం ద్వారా హక్కుల ఉల్లంఘన జరిగే సందర్భాల్ని అదుపుచేయడం, బాలలు ప్రమాదకర సందర్భాలు, హింసాయుత ప్రభావాలు, దోపిడి, దుర్వినియోగం బారిన పడకుండా సంరక్షించడం.

# 5. విధాన అమలులో ప్రధాన అంశాలు

## 5.1. బ్రతుకు తెరువు

జీవించే హక్కు అనేది బాలల నుండి వేరుచేయలేని హక్కు బాలల ఆరోగ్యం, సంరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలనే ఉద్దేశంతో యార్‌ఫోరం ఈ క్రింది చర్యలు చేపడుతుంది.

5.1.1. బాలలందరికీ జన్మించే, జీవించే హక్కుంది. బాలల జీవించే హక్కుని హరించే నేరాలైన గర్భవిచ్ఛిత్తి, ఆడ శిశువులను గర్భంలోనే అంతమొందించడం మరియు భ్రూణ హత్యలు, శిశుహత్యలను రూపుమాపడం.

5.1.2. బాలలకు అత్యవసరమైన, సమయానికి తగిన నాణ్యమైన వైద్యాన్ని, మందుల్ని అందుబాటులోకి తేవడం.

5.1.3. బాల్య వివాహాల్ని నిరోధిస్తూ, తగిన వయస్సులోనే వివాహాలు జరగేలా చర్యలు చేపట్టడం.

5.1.4. బాలహిత, సురక్షిత ప్రదేశాలను వారికి అందిస్తూ, ఆయా సదుపాయాలను వారు సులభంగా పొందేలా చూడడం, పరిశుభ్రమైన వాతావరణం, తగిన మౌలిక వసతులు, నివాసయోగ్య ప్రదేశాలు, ఆటస్థలాలు, రక్షిత మంచినీరు మరగుదొడ్లు మొదలైనవి అందుబాటులోకి తేవడం.

5.1.5. తగిన పౌష్టికాహారం, దుస్తులు అందుబాటులోకి తేవడం.

5.1.6. టీకాల ద్వారా అరికట్టదగ్గ వ్యాధుల నుండి బాలలకు రక్షణ కల్పించేందుకు వారికి వ్యాధి నిరోధక టీకాలు ఇప్పించడం.

# 5.2. అభివృద్ధి

బాలల శారీరక, మానసిక ఎదుగుదలకు, తెలివితేటలు పెంపొందుటకు వారికి వయస్సుకు తగ్గ విద్యాభ్యాసాలు అందుబాటులోకి తేవడం మినహా ప్రత్యామ్నాయం లేదు. తద్వారా వారు ఆత్మవిశ్వాసంతో, సురక్షితంగా, ఆనందంతో జీవించడానికి అవసరమైన జీవన నైపుణ్యాలు అలవర్చుకోవడానికి అవకాశం కల్పించాలి. అందుకు యార్ ఫోరం ఈ క్రింది అంశాలకు ప్రాధాన్యత కల్పిస్తుంది.

5.2.1. ఆయా ప్రాంతాలకు అనువైన, లింగ అవగాహన కలిగిన, బాలహితమైన, నాణ్యతతో కూడిన విద్యను అందించడం, ప్రోత్సహించడం.

5.2.2. ఆటలు, ఖాళీసమయం/విశ్రాంతి, వినోదం, సృజనాత్మకతలు బాలలకు అందే అవకాశాలు కల్పించడం.

5.2.3. ప్రాథమిక విద్యను అందించడం, మధ్యలోనే చదువు మానకుండా చూడడం, పాఠశాలలకు వెళ్ళే బాలల సంఖ్య పెంచడం, నాణ్యతతో కూడిన విద్యను ప్రోత్సహించడం.

5.2.4. బాలల ఆకాంక్షలకు అనుగుణంగా వారి సర్వతోముఖాభివృద్ధికి చేయూతనిస్తూ వారి ప్రవర్తనలను తీర్చిదిద్దడం, ఆత్మగౌరవం, విశ్వాసం, జీవన నైపుణ్యాలు పెంపొందే దిశగా వారి మానసిక పరిణతిపై ప్రత్యేక దృష్టిసారించేలా పాఠ్యాంశాలను సమీక్షించడం.

5.2.5. ఉద్యోగం సంపాదించడానికి, స్వతంత్రంగా జీవించడానికి, సొంత కుటుంబాన్ని ఏర్పాటుచేసుకోడానికి అనువుగా కౌమారంలో ఉన్నవారికి ప్రత్యేక శిక్షణలు అందుబాటులోకి తేవడం.

5.2.6. ప్రాణాంతకమైన వ్యాధుల (హెచ్.ఐ.వి./ఎయిడ్స్, ఇతరత్రా వ్యాధులు) బారినపడ్డ బాలలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని, వారికి తగిన వైద్య సదుపాయాలు, ఆరోగ్య సంరక్షణ, పౌష్టికాహారం, విద్యను అందించడం, వారు ఎటువంటి వివక్షలకు గురికాకుండా సంరక్షించడం.

5.2.7. బాలలకు తమ హక్కుల పట్ల అవగాహన కల్పించి, వాటి ఉల్లంఘన జరిగిన సందర్భాల్లో ఏ విధమైన సహాయాన్ని పొందగలరో తెలియజేయడం.

5.2.8. సంస్థల్లో ఎవరి తోడూ లేకుండా ఉంటున్న బాలలకు వారి స్వీయ సంస్కృతి, పర్యావరణానికి దగ్గర చేసేందుకు, వారి సర్వతోముఖాభివృద్ధికి దోహదం చేసే వాతావరణాన్ని కల్పించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలి. బాలల్లో సురక్ష భావాల్ని పెంపొందించేందుకు, వారి అత్యున్నత ప్రయోజనాల్ని కాపాడేందుకు ఆయా బాలల్ని వారి కమ్యూనిటీకి, కుటుంబ సమూహాలకు దగ్గర చేసే ప్రయత్నం జరగాలి.

5.2.9. బాలలకు చేదోడువాదోడుగా ఉంటూ, మద్ధతుగా పర్యవేక్షిస్తూ, వారికి అవసరమైన రక్షణ, సహాయ సహకారాలు అందించడం, స్నేహపూరితమైన, ఆలనాపాలనా చూసే కుటుంబ వాతావరణాన్ని కల్పించడం.

5.2.10. బాలల సంరక్షణ చేసేటప్పుడు వారికి తగిన స్వేచ్ఛను ఇవ్వాలి. వారితో తెలివిగా ఉండాలి. నైతిక మద్దతు అందించాలి. ప్రేమతో కూడిన వ్యవహారణతో వారికి క్రమశిక్షణ అలవర్చాలి. బాలలను శారీరకంగా దండించడం, నలుగురిలో అవమానించడం చేయరాదు.

5.2.11. బాలలకు సంరక్షణ, విద్యను అందించేటప్పుడు సంస్కృతి హితమైన, మతాన్ని గౌరవించే, పరమత సహనాన్ని అవలంభించే దిశగా కృషిచేయాలి. "ఎవరి నమ్మకాలు, సంస్కృతికి వారు నిబద్ధులై ఉంటూనే ఇతరుల నమ్మకాల్ని, సంస్కృతిని గౌరవించాలి" అనే నినాదాన్ని యార్ ఫోరం ధృడంగా విశ్వసిస్తోంది. ఈ అంశాన్ని క్రియాశీలంగా అమలులోకి తేవడానికి కట్టుబడి ఉంది. బాలల్లో దైవంపట్ల, ఇతరుల పట్ల, ప్రపంచం పట్ల (ఓపెన్‌నెస్) పెంపొందించడం; అదే సమయంలో ప్రతి ఒక్కబాల సంస్కృతి, నిష్కాట్యం మత విశ్వాసాలను గౌరవించడం జరుగుతుంది. బాలల్లో ఇతర మతాలను, సంస్కృతులను గౌరవించే వైఖరి పెంపొందించడానికి ప్రధాన్యత ఇవ్వాలి.

5.2.12. బాలలతో సలహా, సంప్రదింపులు (కౌన్సిలింగ్) వైఖరిని వ్యవహరించాలి. వారి వ్యక్తిగత అభివృద్ధికి వ్యక్తిగత స్థాయిలో సలహాలు, అలాగే సమూహ/కమ్యూనిటీతో సత్సంబంధాలు నేరిపేలా తీర్చిదిద్దడానికి గ్రూప్ కౌన్సిలింగ్‌ని అందించాలి.

# 5.3. రక్షణ

విశ్వసనీయమైన (పాజిటివ్), సురక్షితమైన వాతావరణాన్ని కల్పించుట ద్వారా బాలల అభివృద్ధి, ఎదుగుదల, ఆరోగ్యం, విద్యాభ్యాసాన్ని ప్రభావితం చేసే వీలుంది. ఆవిధంగా వారు జ్ఞానవంతులై, నిబద్ధతను, సహనాన్ని కలిగిన పరిపూర్ణ వ్యక్తులుగా రూపొందుతారు. సంరక్షణ చర్యలు చేపట్టడం, విధానాల కల్పన, నిబంధనల అమలు, సహాయ సహకారాలు అందించుట ద్వారా ఈ లక్ష్యాన్ని సాధించే వీలుంది.

a. బాలల సంరక్షణలో ప్రభుత్వానికి చెందిన వివిధ విభాగాలు, స్వచ్ఛంద సంస్థలు, దాతలు, సమాజం, కుటుంబం, సివిల్ సొసైటీ సంఘాలు, బాధ్యతాయుతమైన పౌరులు అందరూ కలిసి అనుసంధానంగా ఏర్పాటు చేయాల్సి ఉంది. మన సమాజాన్ని బాలల మేలు కొరకు. వారిని సంరక్షించే విధంగా మార్చడానికి ఈ విధానం దోహదం చేస్తుంది.

b. సమాజంలో బాలల రక్షిత వలయాన్ని ఏర్పాటుచేయడం ద్వారా బాలలకు ప్రమాదకరమైన/దుర్వినియోగపరిచే విషయాల నుండి రక్షణ కల్పించే వీలుంది. లైంగిక అత్యాచారం, దోపిడీ, తరలించడం, సైనిక దళంలో నియమించబడడం, బాల్యవివాహం, అవసరం లేకుండానే సంస్థల్లో ఉంచడం... ఇవన్నీ వేర్వేరు రూపాలలో బాలలపై కొనసాగుతున్న హింసకు ప్రతిరూపాలు. బాలల సంరక్షణ అంటే వారిపై జరుగుతున్న అత్యాచారాలు, నిర్లక్ష్యాలు, దోపిడీ, హింసల నిరోధానికి 'అవును' అనడం, ప్రతిస్పందించడం, పరిష్కరించడం.

c. పిల్లలకు దుర్విని యోగం నుండి నిర్లక్ష్యం నుండి. దోపిడి నుండి మరియు హింస నుండి రక్షణ కావాలి.

# 5.3.1. దుర్వినియోగం (Abuse)

బాలల రక్షణ, బాగోగులు, హుందాతనం, అభివృద్ధికి భంగం వాటిల్లేలా వారి పట్ల చెడుగా ప్రవర్తించడాన్ని దుర్వినియోగంగా పేర్కొనవచ్చు. శారీరక, లైంగిక, మానసిక, భావయుత చెడు ప్రవర్తనలన్నీ దుర్వినియోగానికి వివిధ రూపాలు. వాటిలో అధికార దుర్వినియోగాన్ని ప్రధానంగా గమనించవచ్చు. ఎందుకంటే దుర్వినియోగం చేసేవారికి, చేయబడేవారికి మధ్య అధికార వ్యత్యాసం ఉండే అవకాశాలు ఎక్కువ.

### 5.3.1.1. శారీరక దుర్వినియోగం

శారీరకంగా గాయాలపాలు చేయడం, బాధకు గురిచేయడం (ఉదా:- కొట్టడం, బలంగా ఊపడం, కాల్చడం, హింసించడం వగైరా) తీవ్రమైన దండన/బల ప్రయోగం చేయడం.

### 5.3.1.2. భావయుత లేదా మానసిక దుర్వినియోగం

చిన్నబుచ్చడం, బాధించే విధంగా మారు పేర్లతో పిలవడం, ఎప్పుడూ విమర్శించడం, ప్రాధాన్యత ఇవ్వక తక్కువగా చూడడం, అదేపనిగా గుచ్చిగుచ్చి మాట్లాడడం, అందరికీ దూరంగా పెట్టడం, ఏకాకిని చేయడం.

### 5.3.1.3. లైంగిక దుర్వినియోగం

రక్త సంబంధీకులతో నిషేధింపబడ్డ సంబంధం, బాల్య/బలవంతపు వివాహం, అత్యాచారం, అశ్లీల చిత్రీకరణలో పాలుపంచుకోవడం, లైంగిక బానిసత్వం. ఇవన్నీ బాలల పట్ల జరుగుతున్న లైంగిక దుర్వినియోగాలే. బాలలను అశ్లీలంగా స్పృశించడం, బహిర్గతపరచడం, వారిని ఉద్దేశించి అశ్లీల పదజాలాన్ని వాడడం, అశ్లీల చిత్రాల్ని చూపడం వంటి చర్యల్ని సైతం లైంగిక దుర్వినియోగంగా పరిగణిస్తారు.

## 5.3.2. నిర్లక్ష్యం

5.3.2.1. ఉద్దేశపూర్వకంగా లేదా అలసత్వం చేత బాలల సంరక్షణను నిర్లక్ష్యం చేయడం; పిల్లలకు రక్షణ మరియు అభివృద్ధి వారి హక్కులు.

5.3.2.2. కొన్నిసార్లు నిర్లక్ష్యం అనేది సరైన సమయంలో బాలల సంరక్షణకు అవసరమైన చర్యలు చేపట్టకపోవడం దీనివల్ల బాలల ఆరోగ్యం, అభివృద్ధి, మానసిక, సామాజిక ఎదుగుదలకు అవరోధం ఏర్పడుతుంది.

5.3.2.3. ఎలా పిల్లలు నిర్లక్ష్యానికి గురి అయ్యారు అనేదానికి చాలా విషయాలు గుర్తుగా కనిపిస్తాయి. ఈ గుర్తులనే అర్థం చేసుకుని స్పందించక పోవడం కూడా నిర్లక్ష్యమే.

5.3.2.4. తీవ్రమైన, అనునిత్య నిర్లక్ష్య ధోరణులు (సాక్షీభూతమైన అంశాలు.) బాలలకు ప్రమాదంగా పరిణమించే వరుస వైఫల్యాలు నిర్లక్ష్యంగా పేర్కొనాలి. ఉదా॥ ఉద్దేశపూర్వకంగా వైద్య సహాయం అందించకపోవడం తద్వారా ఒక బాలుడు/బాలికకి హాని కలిగించడం, వారిని మరణానికి చేరువ చేయడం.

## 5.3.3. దోపిడి

బాలల్ని ఇతరులు తమ స్వప్రయోజనాలకు, ధనార్జనకు వాడుకోవడం, ఫలితంగా వారు అన్యాయానికి, క్రూరత్వానికి, హింసాపూరిత వ్యవహరణకు గురికావడాన్ని దోపిడీగా పేర్కొనాలి. ఇటువంటి హేయమైన చర్యలు బాలల శారీరక, మానసిక ఆరోగ్యం, విద్య, సామాజిక, భావయుత, నైతిక ఎదుగుదలపై తీవ్రమైన ప్రభావాన్ని చూపిస్తాయి. దుర్వినియోగపర్చడం, బాధకు గురిచేయడం, అణగదొక్కడం, చిన్నచూపు చూడడం వంటి సంఘటనలన్నీ దోపిడి కిందకి వస్తాయి. పిల్లలకు వారి వయస్సు, సామర్థ్యం, ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని బాధ్యతలు అప్పగించాలి.

బాలలపై జరగుతున్న దోపిడీని రెండు విధాలుగా గుర్తించారు. అవి లైంగిక దోపిడి, ఆర్థిక దోపిడి

5.3.3.1 లైంగిక దోపిడి: బాలల బలహీనతను/నిస్సహాయతను వారికి పెద్దల మీద ఉన్న నమ్మకాన్ని ఆసరాగా తీసుకొని వారిపై లైంగిక దోపిడీకి తెగబడడం, వ్యక్తిగత లైంగిక వాంఛలు తీర్చుకోవడం కోసం, ధనార్జన, సామాజిక లేదా రాజకీయ లాభాల కోసం బాలల్ని లైంగిక దోపిడికి గురిచేయడం లేదా బాలల్ని బలిచేయడం. ఉదాహరణికి వ్యభిచారంలోకి దించడం, లైంగిక దోపిడీ నిమిత్తం రవాణాచేయడం, అశ్లీల చిత్రీకరణ, లైంగిక బానిసత్వం, లైంగిక హింస వేదింపులు మొదలైనవి.

5.3.3.2. ఆర్ధిక దోపిడి: పిల్లల్ని పనిలో లేక ఇతర కార్యక్రమాల్లో లాభం కోసం వాడడం ఆర్థిక దోపిడి. బాలకార్మికులు ఆర్ధిక దోపిడికి ఒక ఉదాహరణ మాత్రమే పిల్లల మీద ఆర్ధిక దోపిడి ఎన్నో విధాలుగా జరుగుతున్నాయి. లాభాల కోసం చేస్తే, పంపిణి, వ్యయం, సేవలు ఇవ్వన్ని కూడా దోపిడి అవుతుంది. పాచిపని, బాల సైనికులుగా, నియమించడం, బాలల వెట్టి చాకిరి, మత్తు మందుల అమ్మకం, పంపిణి మొదలైన నేర పూరితే చర్యలు బాలుర ఆర్ధిక దోపిడి అవుతాయి.

## 5.3.4. హింస

5.3.4.1. అంతర్జాతీయ బాలల హక్కుల నివేదికలోని ఆర్టికల్ 19 ప్రకారం లైంగిక దుర్వినియోగంతో సహా అన్ని రకాలైన శారీరక, మానసిక హింసలను, హింసాయుత చర్యల క్రింద పరిగణించాలి. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించిన హింస మరియు ఆరోగ్యం (2002) నివేదికలో ఈ విధంగా పేర్కొంది. “బాలల ఆరోగ్యం, జీవనం, అభివృద్ధి, మర్యాదలకు భంగంవాటిల్లేలా లేదా భంగకరంకాగల చర్యలైన శారీరక బలం లేదా శక్తిని ఒక వ్యక్తి లేదా సమూహం బాలలపై ఉద్ధేశపూర్వకంగా వినియోగించడం లేదా వినియోగిస్తామని బెదిరించడం”.

5.3.4.2. ప్రపంచ ఆరోగ్య సంస్థ మూడు రకాలైన హింసలను గుర్తించింది.

(i) స్వీయ హింస: ఆత్మహత్య, తనను తాను గాయపరుచుకోవడం.

(ii) వ్యక్తుల మధ్య హింస: అన్ని రకాలైన శారీరక/లైంగిక, మానసిక దుర్వినియోగాలు, నిర్లక్ష్యం, దోపిడి, గృహ హింస, ఇతర లింగ ఆధారిత హింసలు.

(iii) సామూహిక హింస (Collective violence): ప్రభుత్వం లేదా సమాజం పాల్పడిన హింస.

5.3.4.4. సైనికులు/రక్షణ, ఇతర దళాలు జరిపే హింస, మరణ శిక్ష, క్రూరమైన, అవమానసీయమైన, కించపరిచే చర్యలు, బలవంతపు స్థానభ్రంశం, అన్యాయంగా కారాగారంలో ఉంచడం, తదితరాలు ఈ కోవకు చెందినవి. యుద్ధాలు, టెర్రరిజం, వ్యవస్థీకృత నేరాలు, భ్రూణ హత్యలు, పరువు హత్యలు, శారీరక దండన విధించడం లేదా బెదిరించడం వంటివి కూడా సామూహిక హింసకు ప్రతిరూపాలే.

5.3.4.3. బాలల్ని చేతితో కొట్టడం, గిల్లడం, జుట్టుపట్టి లాగడం, అసౌకర్యమైన, కించపరిచేలా ఉన్న స్థానాల్లో వారిని ఉంచడం, శారీరక వ్యాయామాన్ని దండనగా వాడడం, కాల్చడం, గాయపర్చడం, అవమానించేలా శిక్షించడం, మానసికంగా బాధించడానికి బాలల్ని తిట్టడం, విమర్శించడం, ఒంటరిని చేయడం, నిర్లక్ష్యం వహించడం... ఇవన్నీ దండన (కార్పొరల్ పనిష్మెంట్) కిందకి వస్తాయి.

## బాలల సంరక్షణ పట్ల యార్ ఫోరం నిబద్ధత

బాలల సంరక్షణకు యార్ ఫోరం కట్టుబడి ఉంది. బాలలు ఎదుర్కొంటున్న సమస్యలను గ్రహించి, ప్రమాదాల నుండి రక్షణ కల్పిస్తూ బాలలు వ్యక్తులుగా రూపొందే క్రమంలో వారిపై హానికర అంశాల ప్రభావాన్ని తగ్గించడానికి దోహదం చేస్తుంది.

1. సమస్యలలో ఉన్న బాలలకు చేయూతనిచ్చేందుకు తగిన కార్యక్రమాల రూపకల్పన, అమలుపై దృష్టి సారించడం, బాలలకు అన్నివిధాలైన అనగా అవమానసీయమైన చర్యలు, దుర్వినియోగం, దోపిడి, నిర్లక్ష్యం, హింసల నుండి రక్షణ కల్పించేలా సంబంధిత వ్యవస్థలతో సమన్వయంతో పనిచేయడం.
2. బాలలకు హాని కల్గించే సాంప్రదాయ అలవాట్లైన బాల్య వివాహం, శారీరక దండన, ర్యాగింగ్, మానవ బలులు, పరువుహత్యలు, మంత్రగత్తెలు/మంత్రగాళ్లంటూ వ్యక్తుల్ని వేధించడం/ హింసించడం వంటి వాటిపై అవగాహన కల్పించడం.
3. సమస్యలలో ఉన్న బాలల ప్రత్యేక అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వారికి ప్రత్యేకించి రక్షణ చర్యలను చేపట్టడం, పథకాలు అమలుచేయడం, పునరావాసానికి తగిన ఏర్పాటుచేయడం.
4. మధ్యలోనే చదువు మానేసిన బాలల్ని తిరిగి పాఠశాలలో చేర్పించేందుకు తగిన చర్యలు తీసుకోవాలి. అదేవిధంగా వారు చదువు మానేసి బాల కార్మికులుగా మారడం లేదా ఇతర దోపిడీలకు గురికాకుండా చూడడం.
5. బాలల రక్షణ బాధ్యతల్ని చేపట్టే వ్యక్తులకు తగిన సమాచారం, విద్య, సరైన వైఖరి, అభ్యాస నైపుణ్యాలతో శిక్షణ అందించుట ద్వారా సామర్థ్యాలను పెంపొందించడం.
6. బాలలు తమని తాము రక్షించుకునే దిశగా, ప్రమాదభరితమైన పరిస్థితుల్లో ఏవిధంగా ప్రతిస్పందించాలో అన్న దానిపై వారిలో అవగాహన కల్పించడం.
7. ఆస్తుల్ని కాపాడుకునేలా, వారసత్వపు హక్కుల్ని పొందేలా బాలలకు అవసరమైనప్పుడు మద్ధతు ఇవ్వాలి. ఏ రూపంలోనైనా బాలలపై దుర్వినియోగం, నిర్లక్ష్యం, దోపిడి, హింసలను అంగీకరించరాదని యార్ ఫోరం నమ్ముతోంది. బాలుడు/బాలిక దుర్వినియోగానికి, దోపిడికి, నిర్లక్ష్యానికి, హింసకు గురవుతున్నారని తెలిసి కూడా మౌనంగా లేదా విముఖంగా ఉండడం సరైనది కాదు.

# 5.4. పాల్గొనడం

బాలల జీవితాన్ని, వారు జీవించే సమూహాల్ని ప్రభావితం చేసే నిర్ణయాలలో బాలలు పాలుపంచుకోవడం. బాలలకు వారి హక్కులపట్ల అవగాహన కల్పించాలని యార్ ఫోరం కోరుకుంటోంది. తద్వారా వారి నైపుణ్యాలను మెరుగుపర్చడం, ఆశయాల కల్పన, అభిప్రాయాల వెల్లడికి (బాలల వయస్సు పరిణతికి అనుగుణంగా) ఆస్కారం ఇచ్చినట్టవుతుంది. ఈ చర్యల ద్వారా బాలలు తమ అభివృద్ధిలో స్వయంగా పాలుపంచుకనేందుకు వీలవుతుంది. దీనికి అనుగుణంగా యార్ ఫోరం ఈ క్రింది అంశాలను అమలుచేస్తుంది.

5.4.1. బాలల అభిప్రాయాలను గౌరవించాలి. వారితో చర్చించడం ద్వారా వారికి సంబంధించిన విషయాలని అర్థం చేసుకోవాలి.

5.4.2. బాలల భాగస్వామ్యం/పాల్గొనడం అనే అంశాలపై సంస్థలోని వ్యక్తుల అవగాహన/సామార్థ్యాలను పెంచడానికి తగిన శిక్షణను అందించాలి.

5.4.3. తమ హక్కుల గురించి అవగాహన కల్పించుట ద్వారా బాలల్ని బలోపేతం చేయాలి.

5.4.4. సంక్షేమ విధానాల నుండి హక్కుల సాధన దిశగా కార్యక్రమాలను రూపొందించాలి. బాలల వయస్సుని పరిగణనలోకి తీసుకొని కార్యక్రమాల రూపకల్పన, అమలు, విశ్లేషణ అంశాల్లో వారు పాల్గొనేలా చర్యలు తీసుకోవాలి. బాలలకు సంబంధించిన విషయాల్లో వారి ప్రమేయం, భాగస్వామ్యం ఉండేలా వ్యవస్థల్ని రూపొందించాలి.

5.4.5. బాలల క్లబ్బులు, గ్రూపులు, ఉద్యమాల్లో సభ్యులయ్యే అవకాశం బాలలకు కల్పించాలి.

5.4.6. జీవన పరమార్థం, బాధ్యతలు తెలిసి పరిణతితో కూడిన వ్యక్తులుగా బాలలు ఎదిగేందుకు అవకాశాలు కల్పించాలి. దైవ సంబంధమైన మతపరమైన వ్యవహారాల్ని అర్థవంతంగా జరిపే ప్రవర్తనలను ప్రోత్సహించాలి.

5.4.7. పిల్లలతో స్నేహభావం, భాగస్వామ్యంగల ఒక ఇరుగుపొరుగు ప్రాంతం సమాజం సృష్టించుట.

5.4.8. బాలలకు జీవన నైపుణ్యాల శిక్షణను అందించాలి. తద్వార సరైనా జ్ఞానాన్ని, ప్రజ్ఞను కలిగి తమకు సంబంధించిన అంశాల సంబందిత నిర్ణయాల్లో భాగస్వామ్యులై తమ జీవనాన్ని అర్థవంతంగా మలచుకుంటారు. వారికి తమ హక్కుల గురించి అవగాహన ఉంటుంది, ఎక్కడికి వెళ్ళాలో, ఏమి మాట్లాడాలో, ఎవరిని పట్టించుకోరాదో, ప్రమాదాలకు ఎలా స్పందించాలో తెలుస్తుంది.

# 6. సంస్థాగత నియమావళి

బాలల సంరక్షణ అనేది సంస్థాగత విధానాలు, పాలసీలు, అమలు విధానానికి సంబంధించింది. తమ సంస్థలో ఉన్న బాలల సంరక్షణ చేపట్టాల్సిన బాధ్యత ఆయా సంస్థలపై ఉంటుంది.

6.1. పెద్దలందరూ తమ సంరక్షణలో ఉన్న బాలలకు గౌరవం మరియు మర్యాద అందించాలి. ప్రతి ఒక్క బాలబాలికను ఏకైకవ్యక్తులుగా పరిగణించి, వారి యొక్క ప్రత్యేక లక్షణాలు, అవసరాలకు తగిన వ్యక్తిగత ప్రణాళికలు/విధానాలు రూపొందించాలి.

6.2. బాల విధానం (ఛైల్డ్ పాలసీ) లో పేర్కొన్న అంశాలు తమకు అవగతమైనట్టుగా సంస్థలో ప్రతిఒక్కరూ సంబంధిత పత్రంపై సంతకం చేయాలి. బాల విధానాన్ని గౌరవిస్తూ దానికి కట్టుబడి ఉండాలి. ఒకవేళ వారి ప్రవర్తన తద్భిన్నంగా, బాల విధానానికి వ్యతిరేకంగా ఉన్న పక్షంలో వారిపై తగు చర్యలు తీసుకుంటారు.

6.3. సంస్థ లక్ష్యాలకు భిన్నమైన ప్రయోజనాల కోసం వినియోగించడానికి బాలలను, వారి కార్యక్రమాలను, ఫోటోలు, వీడియో తీయడానికి, రికార్డుచేయడానికి వాలంటీర్లు, బయటివారు ముందుగా సంబంధిత అధికారిక వ్యక్తుల నుండి అనుమతి పొందాల్సి ఉంటుంది.

6.4. ఇతరులు చూడని విధంగా బాలలతో ఒంటరిగా గడపడంలో ఉన్న ఇబ్బందుల గురించి సంస్థలో అందరికీ అవగాహన ఉండాలి. అటువంటి సందర్భాలకు తావివ్వకూడదు.

6.5. బాలల రక్షణ కొరకు మరియు వారి సహృద్భావ వాతావరణం కొరకు ఫోరం సభ్యులందరు కూడా సంస్థ యొక్క సమాచార నిక్షిప్తం తగ్గట్టుగా అంటే ( Article: 1.2.2) ప్రకారం నడుచుకొనవలెను లేదా పాటించవలెను.

6.6. బాలలకు క్రమశిక్షణ అలవర్చడానికి వారిపట్ల ఎటువంటి హింసాపూరిత చర్యలకు పాల్పడరాదు. సంస్థకు చెందిన ఏ వ్యక్తి అయినా బాలలను బయటికి వెళ్ళగొట్టడానికి వీలులేదు. సంబంధిత అధికారులు మాత్రమే బాలల విధానాన్ని దృష్టిలో ఉంచుకుని పరస్పర సంప్రదింపులు జరిపి ఆ విధమైన నిర్ణయాన్ని తీసుకునే వీలుంది.

6.7. జీవితంలో విషాదకర పరిస్థితులు ఎదుర్కొన్న, దోపిడీకి గురైన బాలలు ప్రత్యేక గుర్తింపు కోరుకుంటూ విపరీత ప్రవర్తన కలిగి ఉండే అవకాశం ఉంది. సంస్థలో పనిచేస్తున్న వారికి ఈ విషయంపై అవగాహన ఉండాలి. బాలల ప్రవర్తన, కోపోద్రిక్తతతో కూడుకున్నదైనా, పెద్దలు వారితో సంయమనంతో, బాధ్యతతో వ్యవహరించాలి. అటువంటి సందర్భాలు తలెత్తకుండా జాగ్రత్తపడాలి.

6.8. బాలల పట్ల అనుచిత ప్రవర్తన కలిగినవారు, యార్ బాలల సంరక్షణ విధానానికి అనుగుణంగా విధినిర్వహణ చేయనివారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవడం లేదా ఉద్యోగం/వాలెంటరీ/ ఇంటర్న్‌షిప్/బోర్డు లేదా కమిటీ సభ్యత్వం నుండి తొలగించే అవకాశముంది.

6.9. పెద్దలు తాము ప్రదర్శించే మరియు ప్రవర్తించే తీరు, దుస్తులలో, భాషలో, చర్యలో, పిల్లలతో, సంబంధాలలో చాలా సమంజసంగా ఉండాలి. బాలల సమక్షంలో పద్ధతిగా వ్యవహరించడానికి ప్రాధాన్యత ఇవ్వాలి. (ఉదాహరణకి సంస్థ సంరక్షణలో ఉన్న బాలల ముందు అసభ్య పదజాలం వాడడం, పొగాకు ఉత్పత్తులను వినియోగించడం లేదా మద్యం సేవించడం చేయకూడదు).

6.10. హింసకు గురైన లేదా తీవ్రమైన సమస్యలతో బాధపడుతున్న బాలలకు సంబంధిత నిపుణులచేత సహాయం అందించగలగాలి అందుబాటులోకి తేవాలి.

## 7. నియామకం, శిక్షణ, సామర్థ్యాల పెంపెదల

7.1. మానవ వనరుల విధానాన్ని (హెచ్. ఆర్ పాలసీ) అనుసరించి ఉద్యోగుల పరీక్ష, ఎంపిక, నియామకం అంశాల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకోబడుతుంది. బాలల సంక్షేమానికి కృషిచేసినట్టు రికార్డులు ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుంది.

7.2. బాలల పట్ల స్నేహపూరిత స్వభావం కలిగి వారి సంరక్షణ, అభివృద్ధికి సంబంధించిన అర్హతలు, డిగ్రీలు/పెడగోజీ, సోషియాలజీ, సైకాలజీ మరియు దీర్ఘకాలికంగా బాలల సంక్షేమం కోసం పనిచేసిన అనుభవం కలవారిని ఎంపిక చేయడం జరగుతుంది.

7.3. బాలల అత్యున్నత ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని గతంలో బాలలపై హింసకు, అనైతిక ప్రవర్తన, తదితర నేరాలకు పాల్పడినట్లు నిర్ధారణ జరిగినవారిని ఉద్యోగ నియామకాలకు పరిగణించడం జరగదు.

7.4. బాల విధానం, బాలల హక్కులు, సంబంధిత చట్టాలు/న్యాయ వ్యవస్థ పెడగోజి ఆఫ్ ప్రెజెన్స్ (నిరోధక వ్యవస్థ)ల సంస్థ ఉద్యోగులకు అవగాహన కల్పించేందుకు శిక్షణ, సామర్థ్యాలను పెంచే కార్యక్రమాలు, తదితర చర్యలను చేపట్టడం జరుగుతుంది.

7.5. బాలల సంరక్షణ విధానాలు, వ్యవహారణ నియమావళిని ఎప్పటికప్పుడు సమీక్షించడానికి సంస్థ పునరంకితమై ఉంటుంది.

7.6. సంవత్సరంలో ఒకసారి స్వీయ సమీక్ష, సహోద్యోగులచే సమీక్ష, సంస్థాగత సమీక్ష విధానాల ద్వారా బాలల సంరక్షణ పట్ల ఉద్యోగులు, వాలంటీర్ల నిబద్ధతను సమీక్షించడం, పర్యవేక్షించడం జరుగుతుంది.

7.7. నియామకం, శిక్షణ, సామర్థ్య సంబంధ మొదలైన విషయములు కొరకు యార్‌ఫోరం సభ్యులు పాటించవలసిన పద్ధతి ఈ క్రింద ఇచ్చిన పత్రములో దొరుకుతుంది. “protections of Minors: Policy Statement and guidelines for use in Salesian Institutions”, (Act. 2.1.2.2.2) published by SPCSA, New Delhi, 2006.

## 8. సమాచార నిక్షిప్తం, పరిశోధన

8.1. జువెనైల్ జస్టిస్ యాక్ట్, సంబంధిత పాలసీలను మార్గదర్శకంగా తీసుకుని బాలలకు సంబంధించిన సమాచారాన్ని సమర్థవంతంగా సేకరించే, భద్రపరిచే /డాక్యుమెంట్ చేసే వ్యవస్థల్ని ఏర్పర్చడంతో పాటు సంస్థ నిర్వహించిన కార్యక్రమాల సమాచారాన్ని కూడా క్రోడీకరించడం జరుగుతుంది.

8.2. సమాచారం ద్వారా ప్రస్తుత విధానాల్లో ఉన్న అంతరాలను గుర్తించి తదనుగుణంగా ఆపదలో ఉన్న బాలల తరపున భవిష్యత్తు కార్యాచరణను రూపొందించడం జరుగుతుంది.

8.3. ప్రమాదంలో ఉన్న బాలలకు ప్రభావవంతమైన సేవలు అందించేందుకు, పెరుగుతున్న అవసరాలు తీర్చేందుకు వీలుగా బాలల అంశాల్లో అధ్యయనాలు/పరిశోధనలు జరపడం, ఉద్యోగులకు పూర్తి స్థాయిలో శిక్షణ ఇవ్వడం జరుగుతుంది.

8.4. సంస్థ సంరక్షణలో ఉన్న బాలల అభివృద్ధిని నమోదుచేయడం, వారికి అనువైన పునరావాసం కల్పించేదాకా వారి ఎదుగుదలకు సంబంధించిన అన్ని అంశాల పట్ల శ్రద్ధవహించడం జరుగుతుంది.

## 9. విధాన సమర్థన

9.1. ప్రమాదంలో ఉన్న బాలలు చాలా సందర్భాల్లో వారి ఇబ్బందులు గురించి తమకు రక్షణ ఇవ్వగలవారికి చెప్పలేరు. యార్ ఫోరం బాలల గొంతుల్ని ప్రభుత్వానికి, ఇతర రక్షణ వ్యవస్థలకి వినిపించేందుకు అనువైన వేదికలను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రాధాన్యత ఇస్తుంది.

9.2. జాతీయ విధానాలు, కార్యక్రమాలలో ఉన్న బాలలకు ప్రాధాన్యత ఇచ్చేలా ప్రభుత్వ పాలనను, నిర్ణయాలను ప్రభావితం చేయడం తప్పనిసరి.

9.3. వికలాంగులైన బాలల ప్రత్యేక అవసరాలను గుర్తించేలా ప్రభుత్వం, సంబంధిత వ్యవస్థలు, యంత్రాంగాలు కార్యక్రమాలను సమన్వయపర్చేందుకు ఆయా చర్చాసమావేశాల్లో (కన్సల్టేషన్) పాల్గొనడం జరుగుతుంది.

9.4. బాలల సంక్షేమం నిమిత్తం ప్రభుత్వం, ప్రభుత్వేతర యంత్రాంగాలతో చేతులు కలపడం, సంబంధిత వ్యవస్థలు/కమిటీల్లో సభ్యత్వం భాధ్యతలు చేపట్టడానికి కృషిచేయాలి.

## 10. బాలలకు వ్యతిరేక ప్రవర్తనలు: ఫిర్యాదులు, ప్రతిస్పందనలు

10.1. బాలల పట్ల దుర్వినియోగం, దోపిడి, నిర్లక్ష్యం, హింసలు జరిగినప్పుడు లేదా జరిగే అవకాశం ఉన్నప్పుడు ఆ అంశాల గురించి సంస్థాగత సమావేశాల్లో బహిరంగ చర్చలు నిర్వహించడం జరుగుతుంది.

10.2. సంస్థ ఉద్యోగి ఎవరైనా బాలల పట్ల అనుచితంగా ప్రవర్తించారన్న ఫిర్యాదు అందినప్పుడు వారిపై తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

10.3. ఫిర్యాదు అందినప్పుడు ఆ సమాచారాన్ని ముందుగా బాలల రక్షణ అధికారికి తెలియజేయాలి.

10.4. ఆ ఫిర్యాదు గురించిన సమాచారాన్ని, దానితో ప్రత్యక్షంగా సంబంధం ఉన్నవారికి తప్ప ఇతరులకు తెలియజేయకుండా గోప్యంగా ఉంచాలి.

10.5. ఫిర్యాదుపై జరిపిన విచారణను కూడా గోప్యంగా ఉంచాలి.

10.6. బాలలు తమ పట్ల దుర్వినియోగం జరిగిందని ఫిర్యాదు చేసిన సందర్భంలో నిందితులు ఎవరైనా సరే వారిపై తగిన విచారణ జరపకుండా ఆ నిందారోపణను తోసిపుచ్చరాదు.

10.7. బాలలపై దుర్వినియోగం జరిగిందన్న ఫిర్యాదులపై జరిపిన విచారణలోని వాస్తవాలను నమోదుచేస్తారు. కమిటీ వాటిని గోప్యంగా, జాగ్రత్తగా భద్రపరుస్తుంది. విచారణ మొదలుపెట్టని ఫిర్యాదులపై ఎటువంటి రికార్డు నమోదుచేయల్సిన అవసరం లేదు. కేవలం రాతపూర్వకంగా అందిన ఫిర్యాదులపైనే విచారణ జరుపుతారు.

10.8. ఈ క్రమంలో మొదటి నుండి చివరి వరకూ బాలల, సంబంధిత నిందితులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలి. ఆయా బాలలకు ప్రత్యేక రక్షణ కల్పించాలి. విచారణ జరుగుతున్న సమయంలో నిందారోపణ ఎదుర్కొంటున్నవారిని సెలవుపై పంపించే నిర్ణయం తీసుకోవచ్చు.

10.9. బాలల దుర్వినియోగం ఆరోపణను విదేశీయులు ఎదుర్కొంటున్న సందర్భాల్లో వారి దేశాల రాయబారి కార్యాలయాలకు ఆ సమాచారాన్ని అందిస్తారు.

10.10. ప్రతి సంస్థ ఒక త్రిసభ్య పిల్లల సంరక్షణ సమితి (child protection committee) ఏర్పరుస్తారు. ఈ సభ్యులు యార్ పిల్లల విధానం బాలల హక్కులు వారికి తగిన చట్టాలు గురించి సరైన అవగాహన, పిల్లలతో స్నేహభావం మరియు పిల్లలతో అనుభవం గలవారు కావాలి. ఈ సమితి యొక్క అధ్యక్షుని పిల్లల సంరక్షణ అధికారి (child protection Officer) అని పిలుస్తారు. ఈ సమితిలో ఒక మహిళా సభ్యురాలు ఉండడం సమంజసం.

10.11. పిల్లల దుర్వినియోగం గురించి ఫిర్యాదు స్వీకరించినపుడు పిల్లల సంరక్షణ సమితి ఈ ఆరోపణ గురించి ఒక ప్రాథమిక విచారణ మొదలు పెడతారు. సంస్థ అధికారి (Director) యొక్క అనుమతితో మాత్రమే ఈ విచారణ జరుపుతారు ఒకవేళ విచారణలో తీవ్రమైన దుర్వినియోగానికి పాల్పడలేదని ఋజువైతే తదుపరి. విచరణ కొనసాగుతుంది. ఒకవేళ నేరం ఋజువైతే ఆ సంస్థ యొక్క పైఅధికారి అనుమతితో తగిన చర్య తీసుకుంటారు.

10.12. ఒకవేళ ఆరోపణ పై అధికారి పైనే అయితే అప్పుడు విచారణ అ సంస్థయొక్క అధ్యక్షుడు లేక స్థాపకుడిని సంప్రదించి చేపడతారు.

10.13. ఒకవేళ ఆరోపణ తీవ్రమైన దుర్వినియోగం అయితే బాలల సంరక్షణ సమితి ప్రావిన్షియల్ అధికారికి నమోదు చేయమని ఆసంస్థ యొక్క డైరెక్టర్‌ని కోరుతారు. ఒకవేళ ఆరోపణ డైరెక్టర్‌కి వ్యతిరేకమైతె ఈ విషయం ప్రావిన్షియల్ అధికారికి నమోదు చేయమని సొసైటీ ప్రెసిడెంట్ లేక స్థాపకుడిని కోరుతారు. ప్రావిన్షియల్ అధికారి Provincial commission for professional standards తోటి ఆరోపణపై విచారణ జరుపమని ప్రావిన్షియల్ అధికారి నిర్దేశిస్తారు.

10.14. "Protection of minors: Policy statement and guidelines for use in salesian institutions", (SPCSA ప్రచురణ, న్యూఢిల్లీ, Art:5, 2006) - దీనిలో చెప్పబడిన ప్రకారం Provincial commission for professional standards విచారణ జరుపుతారు.

10.15. ఈ కమీషన్ విచారణలో తీవ్రమైన దుర్వినియోగం ఋజువైతే ఆ వ్యక్తియొక్క ఉద్యోబాధ్యతలను నిలిపివేస్తారు. దీనిని రాష్ట్రకార్మిక చట్టాల ప్రకారం చేస్తారు. తీవ్రమైన దుర్వినియోగం కాకపోతె తగిన శిక్ష అమలుపరుస్తారు. ఏ వ్యక్తులపై తీవ్రమైన దుర్వినియోగం ఋజువైతే వారిని మరొక యార్ కేంద్రానికి పిల్లలో ముడిపడిన ఇతర బాధ్యతలకు బదిలిచేయడానికి అనుమతి లేదు. అటువంటివారిని ఎట్టిపరిస్థితిలో పిల్లల కేంద్రాలలో నియమించకూడదు.

10.16. దుర్వినియోగం యొక్క దుష్ప్రభావం తీవ్రమైనది, చాలాకాలం నిలిచేది. అందకే దర్వినియోగానికి బాదితులైనవారిని మరియు వారి కుటుంబాలని పూర్తిగా నయపరచడానికి మరియు సఖ్యపరచడానికి కావలసిన సహకారం అందించడానికి యార్‌ఫోరం అంకితమవుతారు.

10.17. Provincial commission for professional standards ఒక ఉద్యోగి లేక సలేషియన్ గురించి విచారణ జరిపి చర్యలు తీసుకోవలసినప్పుడు "protection of minors: policy statements and Guidelines for use in salasian institutions" నిర్దేశానుసారం (Art:6) చర్యలు తీసుకోవలసి ఉంటుంది.

10.18. సంస్థ సంరక్షణలో ఉన్న బాలలు కాకుండా చుట్టూ ఉన్న సమాజం (నైబర్‌హుడ్ సొసైటీ) లో బాలలు దుర్వినియోగానికి గురైనట్లు తగిన ఆధారం లభిస్తే ఆ విషయాన్ని 48 గంటలలోపు సంస్థలోని సంబంధిత అధికారికి (కాంపిటెంట్ అథారిటీ) తెలియజేయాలి. సదరు అధికారి బాలల దుర్వినియోగం జరిగిన ప్రాంతానికి చెందిన చట్టపరమైన అధికారులకు (కాంపిటెంట్ లీగల్ అథారిటీ) ఆ సమాచారాన్ని అందజేసే ఏర్పాటు చేయాలి.

10.19. అవసరమైనప్పుడు మీడియా, పోలీసులతో సంప్రదింపులు జరపడానికి సంస్థ ఎవరినైనా నియమిస్తుంది. పోలీసులు, మీడియాకి ఏవిధమైన సమాచారాన్ని తెలియజేయాలి అన్న అంశంపై నిర్ణయాన్ని కమిటీని సంప్రదించి తీసుకుంటారు.

## 11. బాలల గురించి సమాచారాలు

11.1. ఇబ్బందికర/ అవమానకర పరిస్థితుల్లో ఉన్న బాలల చిత్రాలను సంస్థ బహిర్గతం చేయడంగాని, ముద్రించడంగాని చేయరాదు.

11.2 బాలల గురించిన సమాచారం వెల్లడించేటప్పుడు వారి ఫోటోలు, వారి గౌరవానికి భంగం కలిగించనివిగా ఉండాలి. బాలల ఫొటోలు ముద్రించాల్సి ఉంటే వారి అత్యున్నత ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని వారి మర్యాద/గుప్తతీ కాపాడేందుకు సంస్థ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి.

11.3. గతంలో లేదా ప్రస్తుతం దుర్వినియోగానికి గురైన బాలలు, దానికి సంబంధించిన వ్యక్తుల వివరాలు తెలియజేసేటప్పుడు గోప్యతను పాటించాలి. సంఘటన వివరాలు తెలియజేయాల్సిన వ్యక్తులకు మాత్రమే అదికూడా వారికి తెలియాల్సినంత మేరకే తెలియజేయాలి.

11.4. బాలల గురించి సమాచారాన్ని అందించేటప్పుడు ఉపయోగించే భాష గౌరవనీయంగా ఉండాలి.

11.5. ఒకవేళ బాలలకు సంబంధించిన రిపోర్టులలో అశ్లీల/అగౌరవమైన పదజాలం ఉపయోగించినట్లయితే వాటిని సరిచేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలి.

## 12. విధానం యొక్క పరిశీలన, సమీక్ష

ఈనాడు బాలల ఎదుర్కొంటున్న సమస్యలు, ఇబ్బందులు కాలక్రమేణ మారవచ్చు. ప్రస్తుత సమస్యలు తొలగిపోయి కొత్త అంశాలు రావచ్చు. వాటికి అవసరమైన కొత్త ప్రణాళికలు/విధానాలు ఈ పాలసీలో ఉండకపోవచ్చు. కనుక చైల్డ్ పాలసీలోని విధానాలు, అమలు పద్ధతులపై నిర్ణీత వ్యవధిలో సమీక్ష జరపాల్సిన అవసరం ఉంది. యార్ ఫోరం జనరల్ బాడీ సమావేశంలో ప్రతి ఏటా బాల విధానం (చైల్డ్ పాలసీ) పై సమీక్ష జరుగుతుంది. అలాగే యార్ ఫోరం ఆధ్వర్యంలో బాలలతో సహా సంబంధీకులందరి సంప్రదింపులతో ఐదేళ్ళకి ఒక సారి సమగ్ర సమీక్ష నిర్వహిస్తారు. ఈ నివేదికలో పేర్కొన్న అంశాలతో పాటు బాలల సంరక్షణ, ప్రత్యేకించి ప్రమాదం ఉన్న బాలల సంరక్షణకు సంబంధించిన/ఎదురైన విషయాల గురించి కూడా సమీక్షిస్తారు.

## 13. ఈ పిల్లల విధానం ఎవరికి వర్తిస్తుంది?

యార్ ఫోరానికి చెందిన మేనేజ్‌మెంట్ సభ్యులు, కమిటీ/బోర్డు ఉద్యోగులు, వాలంటీర్లు, ఇంటర్న్‌లు, సభ్యత్వం కలిగిన సంస్థలు, వారి ఉద్యోగులు, సంబంధీకులు అందరూ ఈ చైల్డ్ పాలసీకి నిబద్ధులై ఉంటారు.

# అనుబంధం

## 1. బాలలపై జరిగే తప్పుగురించి ఫిర్యాదు పత్రం

### ఆరోపనపై విచారణకు విజ్ఞప్తి

బాలుడు/బాలిక పేరు................................ వయస్సు............................

లింగం.................(పు/ స్త్రీ)

చిరునామ............................................

తల్లిదండ్రుల పేర్లు..............................................................................ఫోన్...........................

చిరునామా...........................................................................................

దుర్వినియోగం/ తప్పు స్వభావం, పరిధి:

ముందు తగిలిన గాయాలు, సంఘటన, పేర్కొనదగ్గ లక్షణాలు/కారణాలు:

నిందితుల గుర్తింపు, చిరునామా (తెలిసిన పక్షంలో):

తేది, పేరు, మరియు సంతకం......................................................

## 2. బాలల విధానం పట్ల అంకిత ప్రకటన

ఈ బాల విధానాన్ని అంగీకరిస్తూ నేను ప్రకటిస్తున్నాను:

(అందరూ సంతకం చేయాల్సి ఉంది.)

ఎ. నేను సంస్థకు చెందిన బాలల సంరక్షణ పాలసీని చదివాను, అర్థంచేసుకున్నాను.

బి. బాలల విధానం (చైల్డ్ పాలసీ)లో పేర్కొన్న అంశాల ప్రకారం నేను పనిచేస్తాను.

సి. బాలల శారీరక, మానసిక, లైంగిక దుర్వినియోగానికి సంబంధించిన లేదా నైతికతకు సంబంధించిన లేదా నైతికతకు సంబంధించిన నేరారోపణలు నాపై జరగలేదు/నిర్ధారించబడలేదు, నాపై అటువంటి కేసులేవి కోర్టు వాయిదాల్లో లేవు

డి. సంస్థల్లో పనిచేస్తున్నప్పుడు బాలల దుర్వినియోగానికి సంబంధించి నాపై ఏమన్నా ఆరోపణలు వస్తే దానిపై విచారణకు సంబంధిత అధికారులతో సహకరిస్తాను

సంతకం................... పేరు........................................

ఉద్యోగ హోదా/డిసిగ్నేషన్....................................................తేది........................................

# పిల్లల దృష్టిలో పిల్లల విధానం

"పెద్దలు తమంతట తాము ఎప్పటికి ఏదీ అర్థం చేసుకోరు. ఐతే బాలలు పెద్దలకు విషయాలను, పదే పదే వివరించడం విసుగు పుట్టిస్తునట్టు ఉంటుంది"

**Antoine de Saint -Exupery in *The Little Prince***

## 1. పరిచయం

ఈ ప్రపంచంలో చాలా మంది మంచివాళ్ళు ఉన్నారు. వారిలో మా పిల్లలందరం ఉంటాము. ఈ మంచివారిలో కొందరు పెద్దలు కూడా ఉన్నారు. కొంతమంది తల్లిదండ్రులు, గురువులు మరియు మన మంచికోసం పనిచేసే కొందరు కూడ. ఈ మంచి వారిలో మాకు నచ్చిన విషయం ఏమిటంటే తమలాగే మిగతా పెద్దలు కూడా పిల్లలపట్ల మంచిగా, స్నేహంగా మెలగాలని కోరుకుంటారు. చరిత్రలో ఇలాంటి మంచివారు చాలామంది ఉన్నారు, వారు గొప్ప విద్యావేత్తలు కూడా. వారందరిలో మనకి కనిపించేది పిల్లల పట్ల స్నేహపూర్వకంగా మెలగడం మరియు ఇతరులు కూడా వారిలాగే మెలగాలని ఆశించడం: బుద్ధ, సోక్రటీస్, జీసస్, రూసో, పెత్సలోసి, డాన్‌బోస్కో మరియా మాంటిస్సరి, టాగూర్, యాన్ పియాజె, గాంధీ, ఏలియనోర రూస్‌వెల్ట్, జిడ్డు కృష్ణమూర్తి, పాలో ఫ్రియర్, ఇవాన్ ఇల్లిక్, ఆలిస్ మిల్లర్ మరియు తదితరులు.

మేము డాన్‌బోస్కో నవజీవన్ పిల్లలం. ఇది సమస్యల్లో ఉన్న పిల్లలకై హైదరాబాద్‌లోని ఒక సంస్థ. భారతదేశంలో మాలాంటి పిల్లలకై ఇటువంటి చాలా కేంద్రాలు సేవలందిస్తున్నాయి. ప్రస్తుత సమాజం పిల్లలపట్ల స్నేహంగా వ్యవహరించడంలేదు ముఖ్యంగా సమస్యల వలయంలో ఉన్న పిల్లలపట్ల. ఇటువంటి పరిస్థితిలో మాగోడు అర్థంచేసుకొని, చేయూతనిస్తూ మాకు భరోసాకల్పించారు. వారు కేవలం మాటలకు పరిమితం కాదు అనడానికి రుజువు మాకొరకు ఈ బాలవిధానం తయారుచేయడం. వారు చెప్పినదాని ప్రకారం ఈ విధానంలో పొందుపరిచినవి ప్రపంచంలోని గొప్పవిద్యావేత్తలు మరియు పిల్లలకై పాటుపడే పెద్దలు మా మంచికై రూపొందించిన సిద్ధాంతాలు. ఇవి మనదేశ చట్టాలకు మరియు ఐక్యరాజ్య సమితి ఆశయాలకు అనుగుణమైనవి.

అర్థం చేసుకోండి అని యేడ్చే మాగోడు మీరు ఆలకించినందుకు సంతోషిస్తున్నాం. "మేము ఖర్చులం కాము; మేము పెట్టుబడులం. మేము కేవలం యువజనులం మాత్రమే కాదు, ఈ ప్రపంచపు పౌరులం. మమ్ము భవిష్యత్తు అని మీరంటున్నారు. కాని మేము ప్రస్తుతం కూడా". ప్రపంచ నాయకుల ఎదుట ఐరాస జనరల్ అసెంబ్లీలో బాలల ప్రత్యేక అధ్యయన సభలో, 8 మే, 2002న మేము చెప్పిన మాటలు మీరు అర్థం చేసుకుంటున్నారు.

మేమందరము చిన్న పిల్లలము. మాకింకా 18 యేండ్లు నిండలేదు. బాధలు పడటం జీవితంలో భాగమే. అనవసరముగా బాధలు పడటం మా జీవితంలో భాగం కావాలని లేదు. గతంలో చాలామంది బాలలం అనవసరంగాను అర్థం లేకుండాను పెద్దల చేతుల్లో కష్టాలు పడినాము. ఈ పెద్దవారిలో కొంతమంది తల్లిదండ్రులు, గురువులు మరియు సంరక్షకులు ఉన్నారు. అందుకే వారిని మేము నమ్మలేము. అయినప్పటికి ఈ బాలవిధానాన్ని చూస్తున్నప్పుడు చల్లారిపోయిన మా లోపలి నిప్పు రగులుకుంటుంది. మా పట్ల మీకున్న అంకితభావం మరియు వాత్సల్యాన్ని వ్యక్తపరుస్తున్నారు. మేము మిమ్మల్ని నమ్మడం ఇప్పుడే మొదలు పెడ్తున్నాము. దయచేసి మరలా మా చేయివిడువకండి.

## 2. విధాన దర్శనం

మేము సమస్యలో ఉన్న బాలలము. ఈ బాల విధానం మా కోసమే. మా ఎదుగుదల కోసం మా ఒక్కొక్కరికి అద్భుతమైన ఒక వాతావరణం యివ్వదలచారు. ఇక్కడ మమ్ము సగౌరవంగా పరిగణిస్తారు. మేము సురక్షితంగా ఉంటాము. మేమొక్కొక్కరము మాకు అవసరమైనది పొందగలము. మా ఉత్తమ ఆసక్తులు అవసరాలు రక్షింపబడతాయి. మేము మా హక్కులకు అందుబాటులోకి చేరతాము. మా బ్రతుకుతెరువు, రక్షణ, ఎదుగుదల, భాగస్వామ్యము, నిజమవుతాయి. దుర్వినియోగం, నిర్లక్ష్యం, దోపిడి మరియు హింసనుండి మాకు రక్షణ కలుగుతుంది. ఇప్పుడు మాకిక్కడ ఆనందప్రద బాల్యము, భవిష్యత్తు, మరి భద్రత సాధ్యమవుతుంది.

## 3. విధాన సూత్రాలు

ఈ బాల విధానంలో క్రింద తెల్పిన ముఖ్యమైన మూలసూత్రాలను చూచి పరిగణిస్తాము. ఈ విధానంలో పొందుపరిచిన సూత్రాలు మాకు చాలా నచ్చాయి.

### ఎ) ఈ బాలవిధానం హక్కులను అనుసరిస్తుంది.

భారతదేశంలో బాలల హక్కులకు రాజ్యాంగం హామీ ఇస్తుంది. బాలలైన మనకు ఇతర ముఖ్యమైన చట్టాలు కూడ ఉన్నాయి. ఈ హక్కులు నిజంగా అనుభవిస్తామని మాకు అర్థమౌతుంది. ఈ విధానం ప్రకారం యిక్కడ అధికారము మాకు సహాయము చేయడానికి మాత్రమే ఉపయోగిస్తారు. మాకు వ్యతిరేకంగా ఉపయోగించరు.

### బి) బాలల మంచి కోసం మాత్రమే

ఎటువంటి చర్యలైనా, నిర్ణయాలైనా తీసుకొని ఉంటే, అవి మా మంచికోసమే, మా మేలు కోసం మాత్రమే ఉంటుందని మాకు అర్థమవుతుంది.

### సి) బాలల హక్కుల సంరక్షణ ప్రభుత్వం యొక్క బాధ్యత

చాలమంది పెద్దలు బాలల కోసం గొప్పగా పని చేస్తారని మాకు తెలుసు. మీరు మాకోసం చేస్తున్న ఈ మంచిపనికి వందనములు. మా యొక్క సంక్షేమ ప్రాథమిక బాధ్యత ప్రభుత్వానిదేనని మాకు అర్థమౌతుంది. మా కోసం మీరు మంచి విధానాలను ప్రోత్సహిస్తున్నారు. వీటి ద్వారా చాలమంది ఇతర బాలలకు కూడ ప్రయోజనం కలుగుతుంది.

### డి) ఏమి చేసినా పిల్లలే కేంద్ర బిందువు

ఈ పెద్దలు ఎల్లప్పుడు మాతోపాటు ఉంటారని మాకు తెలుసు. మమ్ముమమ్ముగా మీరు స్వీకరిస్తారని, మేము ఎదుగుతుండగా మాకు సహాయం చేస్తారని మాకు తెలుసు. మీరు మమ్ము ప్రేమిస్తున్నారు, మమ్ము అర్థం చేసుకొంటూ మరియు మాకు అర్థమయేట్టు వ్యవహరిస్తారు. దేవుడు మమ్ము సంరక్షిస్తున్నారని మేము విశ్వసిస్తున్నాము. మీరు మమ్ము సంరక్షిస్తుండటమే దానికి నిదర్శనము. మా సమగ్ర ఎదుగుదలకు సానుకూలమైన ఒక వాతావరణాన్ని కూడ మీరు కల్పిస్తున్నారు. బాల విధాన సూత్రాల ద్వార మా సంరక్షణను మీరు ధృడపరుస్తున్నారు. మేము పూర్ణశక్తి పొందేవరకు మమ్ము పోషిస్తారు. మీరు భారతదేశపు ఓ స్వల్ప సంఖ్యాక బాలలను మాత్రమే చేరదీయగలుగుతారని మాకు తెలుసు. అందుకే బాలలైన మాకోసం, ఒక సురక్షిత వలయము ఏర్పరచడానికి మీరు మీ ఇతర మిత్రులతో కలసిపనిచేస్తున్నారు. ఈ విధంగా మేము ఎక్కడ ఉన్నా సంరక్షణ పొందుతాము.

## 4. విధాన లక్ష్యాలు

1. ప్రతి ఒక్కరి శారీరక మేలుకు హామీ యివ్వడం
2. బాలసంరక్షణలో అవసరమైన కొలమానాలను పాటించడం
3. బాలసురక్షిత వలయం స్థాపించడం
4. జవాబుదారి పరిపాలనను సాధించడం.
5. బాలల అవసరాలను తీర్చడానికి తగిన చర్యలు చేపట్టడం
6. స్థానిక జాతీయ స్థాయిలలో బాలల హక్కులను వృద్ధిచేయడం
7. బాలల హక్కులను అమలుపరచే సంస్థలను, కావసిన నిధులను ఉపయోగించుకొని, హక్కుల ఉల్లంఘనను అడ్డుకోవడం
8. బాలలను కేంద్రబింధువుగా అర్థం చేసుకుంటూ, ప్రేమతో సన్నిహితముగా ఉండే ఆధ్యయన విధానం ఏర్పరచడం.

# 5. బాల విధాన అమలులో ప్రధాన అంశములు

ఈ బాల విధానం మాకు తెలిసినంతవరకు ముఖ్యమైన బాల హక్కులను ప్రస్తావిస్తుందని మాకు అర్థమౌతుంది. బ్రతుకుతెరువు, ఎదుగుదల, సంరక్షణ, పాలుపంచుకోవడం. ఈ విధానం దుర్వినియోగం, నిర్లక్ష్యం, దోపిడి మరియు హింస నుండి మాకు సంరక్షణ ఇస్తుంది.

## ఎ) బ్రతుకుతెరువు

జీవించడం మా ప్రథమ హక్కు, ఇది మా నుండి విడదీయరానిది. అందువల్ల ఆడశిశువునైన కూడా నాకు జన్మించే హక్కు ఉంది. బాలలుగా మేము ఎటువంటి పక్షపాతానికి గురికారాదు. నేను బాల్యవివాహానికి బలి చేయబడతానని భయపడక్కరలేదు. సగౌరవంగా జీవించే నా హక్కులోనే నాకొక మర్యాదపూర్వకమైన జీవితం గడిపే హక్కు చేరి ఉంది. నాకు చాలినంత అన్నము, దుస్తులు, ఇల్లు, ఆరోగ్య సంరక్షణ అందించబడనున్నది. నా ఎదుగుదలకు అవసరమైన ఏర్పాటు నాకు చేయబడుతుంది.

## బి) ఎదుగుదల

అభివృద్ధి చెందుట నా రెండవ హక్కు. శారీరకంగాను, ఉద్వేగపరంగాను ఎదగడం మా హక్కు. చదువుకోవడం మా హక్కు. మానసికంగాను, ఆధ్యాత్మికంగాను ఎదిగే హక్కు మాకుంది. మేము సమగ్రంగా ఎదగ వలసిన అవసరముంది. మా ప్రస్తుత ఎదుగుదలకు, భవిష్యత్ భద్రతకు జీవిత నైపుణ్యాలు అవసరము. ఈ విధంగా పరిపక్వత చెందిన వ్యక్తులమై మేము రూపొందుతాము. భవిష్యత్తులో మేము ఎవరిమీదా ఆధారపడవలసిన అవసరం ఉండదు. ఈ విధానం ప్రకారము బాలలైన మేము నాణ్యమైన విద్యను అభ్యసిస్తాము. మా పంతుళ్ళు మాతో స్నేహపూర్వకంగా ఉంటారు. బాల-బాలికల మధ్య వారు ఎట్టి వివక్షత చూపరు. మా తల్లిదండ్రులు బడికి తీసుకొనివచ్చినప్పుడు మాకు ప్రవేశం నిరాకరింపబడదు. బడుల్లో ఆటలు, క్రీడలకు సౌకర్యాలుంటాయి. వినోదము, సృజనాత్మక కార్యక్రమాలు ఉంటాయి. విద్యాభ్యాసం తరువాత మేము ఈ పోటీ ప్రపంచాన్ని ఎదుర్కోగలుగుతాము.

ప్రతి ఉదయము మేము ప్రతిజ్ఞ చేస్తున్నాము: భారతీయులందరు నా సహోదరులు. ఇప్పటినుండి విద్యాభ్యాసములో ఈ ప్రతిజ్ఞను పాటించడానికి నేర్పిస్తారు. మాలాగే అనుకూలత లేనివారికి సానుభూతి తెలుపగలుతాము. ఎవరితోను జగడము చేయక, ఇతరుల హక్కులను గౌరవించాలని నేర్పిస్తారని ఆశిస్తున్నాము. స్వేచ్ఛాయుతంగాను బాధ్యతాయుతంగాను మేము ఎదిగే ప్రోత్సాహాన్ని అందిస్తారు.

## సి) సంరక్షణ

సంరక్షణ మా మూడవ హక్కు. ఇది చాల ముఖ్యమైన మా హక్కు. మా తల్లిదండ్రులు మంచివారు. ఐతే సరైన చదువులేక ఒక్కోసారి అదుపుతప్పి ప్రవర్తిస్తుంటారు. అప్పుడు మేము మా సొంతయిళ్ళలోనే భాదితులమవుతాము. చాలాసార్లు మాకు తల్లిదండ్రుల నుండి, ఇతర పెద్దల నుండి రక్షణ కావలసివస్తుంది. ఆప్యాయత మరియు అంకిత భావంగల స్త్రీ పురుషులు మాకు సంరక్షకులుగా ఉంటారని తెలుస్తుంది. ఈ బాల విధానం ప్రకారం మమ్ము సంరక్షించడం మీ ప్రథమ ధ్యేయం.

బాలలు ఎక్కడ ఉన్నా వారి కొరకు రక్షణ వలయము కల్పింప మీరుద్దేశిస్తున్నారని విని మేము సంతోషిస్తున్నాము. మా ఇళ్లలో, గ్రామాలలో, నగరములలోను, మొత్తం సమాజంలో పెద్ద ఎత్తున బాల సురక్షిత వలయాలను కల్పింప మీరు యితర మిత్రులతో కలసి కృషి చేస్తున్నారు. బాలలైన మా కోసం ఏమి అద్భుతలోకాన్ని మీరు కల్పిస్తున్నారు!

బాల విధానాన్ని చూస్తే మాకెంతో నమ్మకం కలుగుతుంది. సాధ్యమైన ప్రతి పద్ధతిలో మీరు మమ్ము సంరక్షింప కోరుతున్నారు. మీరు నాలుగు ఘోరాలు ఆపివేయాలని కోరుతున్నారు.

i. **దుర్వినియోగం** : మాలో కొందరు దుర్వినియోగానికి గురియై ఉన్నారు. తెలిసికూడ కొందరు మాపై దౌర్జన్యము చేసియున్నారు. శారీరకంగాను, లైంగికంగాను, ఉద్వేగపరంగాను, మాకు హాని చేసి యున్నారు. మేము గౌరవము కోల్పోయాము. మా జీవితాలకై మా భవిష్యత్తుకై భయాందోళన చెందాము. మాకు సహాయం చేయవల్సిన వారు కూడా అధికారము చెలాయించి మమ్ము దుర్వినియోగం చేశారు. మేము నిస్సహాయులమైయుంటిమి. మీరిప్పుడు ఇవి ఎప్పటికి జరగవని మాకు హామీ యిస్తున్నారు. మిమ్ము విశ్వసింప మాకు తోడ్పడండి.

ii. నిర్లక్ష్యం : జీవితంలో మేము నిర్లక్ష్యానికి గురియై ఉన్నాము. మేము నిస్సహాయులమై యుంటిమి. ఏ మాత్రము శ్రద్ధ లేకుండ మమ్ము విడిచిపెట్టారు. మమ్ము ఆదుకోవడానికి మమ్ము రక్షించడానికి ఎవ్వరు లేక పోయారు. మా ఆరోగ్యము పాడయి పోయింది. మా ఎదుగుదల నిలిచి పోయింది. పస్తులుండి, రక్తహీనత, రోగపీడనకు బాధితులమైన మమ్మల్ని పట్టించుకోలేదు. ఇప్పుడు మీరు మమ్మాదుకుంటామంటున్నారు. వింటారని, సంరక్షిస్తారని, తోడుగ నిలబడతారని హామీ యిస్తున్నారు అంటే మమ్మల్ని మీరు ఎన్నటికి నిర్లక్ష్యం చెయ్యరు. శెబాస్!

iii. దోపిడి : మీరు లబ్ధిపొందటానికి మమ్ము వాడరని బాలవిధానం ద్వార మాకు హామి ఇస్తున్నారు. పెద్దవారు మమ్ము దోపిడి చెయ్యడం వారి ప్రాథమిక హక్కు అని ఇన్నాళ్లు మాకు అన్పించింది. పెద్దవారు మా మీద చేసిన కౄరత్వానికి, అక్రమాలకు, అన్యాయానికి మీరు ఎవరు బాధ్యులు కారని మమ్ము నమ్మించారు. లైంగిక మరియు వినిమయ సరుకులుగా మమ్ము వాడుకున్నారు. మా మీద ఆధిపత్యం కలిగినందున పెద్దవారు యిది చేయగలిగారు. మేము బలహీనులు, నిస్సహాయులుగా ఉంటిమి. ఇక మాపై దోపిడి జరగదని నిజంగా మీరు చెప్పగలరా? దయచేసి మిమ్ము విశ్వసింప మాకు తోడ్పడండి. మళ్ళీ మిమ్ము నమ్మడం చాలచాల కష్టమవుతుంది.

iV. హింస : మాపై ఎలాంటి హింస జరగకూడదని ఈ బాలవిధానంలో మేము చదివినాము. అలాగే పెద్దవారు తెలుసి మాపై శారీరక హింసకు పాల్పడరు. మీరు మమ్ము బెదిరించరు, మానసికంగ బాధపరచరు, మాకు హానిచేసేవి ఏవి చెయ్యరు, మా గౌరవాన్ని భంగపరచరు. బాల విధానంలో ఇది చదివి నమ్మలేకపోతున్నాము. సకల శారీరక శిక్షలు, ఉద్వేగపరమైన హింసలు చట్టవిరుద్ధమని మేము తెలుసుకున్నాము. మీరు వీటిని గుర్తించి దానికి అనుగుణంగా మమ్ము ఆదరిస్తే మేము ఎంతో సంతోషిస్తాము.

మీరు పిల్లల రక్షణకు అంకితమౌవుతారని మాకు చాల సంతోషం. మీరు మా కుటుంబాలకు మరియు సంఘాలకు అవగాహన కల్పింపబోతున్నారు. బాలలకు హని కలిగించే, ముఖ్యంగా బాలికలకు కీడు చేసే సాంప్రదాయాలు అరికడతారు. సమంజసమైన ధోరణులను, ఆచారాలను మీరు ప్రోత్సహింప తలపెట్టారు. మాలో ఎవరికైనా ఏదో ఒక కీడు జరిగినప్పుడు మీరు మౌనం వహింపక, పట్టించుకోకుండ ఉండరని ప్రతిజ్ఞ చేస్తున్నారా? మేము స్వర్గంలో ఉండబోతున్నాము! మాకెంతో సంతోషం.

### డి) పాలుపంచుకోవడం

దీనిని మా నాల్గవ హక్కుగా ప్రమాణం చేసియున్నారు. మాకు సంబంధించిన నిర్ణయాలను మీరు మాతోపాటు చేస్తారు. మీ నిర్ణయాలను మా మీద నిర్బంధించడం మాకు యిష్టం లేదని మీకు తెల్సు. మేము చేయగోరని పనుల్ని మాచే చేయింప మీరు బలవంతం పెట్టినపుడు మేము అయిష్టత చూపిస్తాము. అప్పుడు మీరు మమ్ము శిక్షించారు. ఇప్పుడు మీరు కొత్త హామీ ఇస్తున్నారు: మాకు అన్ని విషయాలు తెలియపరుస్తారని, మమ్ము సంప్రదించి మా అభిప్రాయాలు తీసుకొంటారని, మా నిర్ణయాలు మేము తీసుకోవడానికి మీరు తోడ్పడతారని, మా అభిప్రాయాలు మేము వ్యక్తపరచగలమని, మేము కలలు, ఆశలు కలిగియుండ గలమని. ఓ యిది మనసుకు తికమక కలిగిస్తుంది.

మేము పాల్గొనబోతున్నాం మరియు భాగస్వాములం కాబోతున్నాము. మీరు మమ్ము సాటి మనుషులుగా పరిగణింపనున్నారు! మనము కలసికట్టుగా సహకిరింపనున్నాము. మీ అధికారాన్ని మాకు వ్యతిరేకంగా ఉపయోగించరు. మనం స్నేహితులం అవుతాము. మాకు యిది కొత్త మనుగడ కానున్నది. ఇది చాలచాల ఆసక్తికరం, సాహసోపేతం కానున్నది! ఇలాగైతే జీవితం ఎంతో బాగుంటుంది!

## 6. సంస్థాగత నియమావళి

సంస్థాగత నియమావళి! నేను నా కౌన్సిలర్‌ను అడిగినప్పుడు, ఆమె నవ్వి చెప్పింది. పెద్దలు మీబోటి పిల్లల గురించి చాలా తీవ్రంగా ఆలోచిస్తున్నారు. మీకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చడానికే ఈ నియమాలు తయారు చేశారు. పెద్దవాళ్ళు మన పక్షంగానే ఉన్నారంటు అబద్ధం చెప్పి తప్పించుకొనే రోజులు పోయాయి! నిజంగా పెద్దలు బాలలను సంరక్షించకపోతె వారిని ప్రభుత్వం పట్టుకుంటుంది. పత్రికలు, ఇతరమాధ్యమాలు లోకానికి చాటడానికి కాచుకొని ఉంటాయి!

ప్రభుత్వాలు అవినీతిలో కూరుకుపోయివున్నాయి. మాధ్యమాలు కూడ ఇంతే. ఐనా కనీసం కొందరినైనా తప్పుల్లో ఇరికించి పట్టుకోవాలన్నది వారి కోరిక. మంచి చేయాలనుకొనే వాళ్ళకు కూడ తప్పులు జరగవచ్చు. దీని మూలాన చట్టాలు అమలుపరుస్తారనే నమ్మకం మాకు కలుగుతుంది.

చెడ్డవారు తప్పులను చేస్తూనే ఉంటారు. మంచివారు కొలమానబద్దమైన ప్రకారము సేవలు అందించకపోతే వారు న్యాయబద్దమైన సమస్యల్లో ఇరుక్కుపోతారు. వారిసేవలు కొనసాగించడానికి అనుమతి ఉండదు. ఇది మాకు మేలన్పిస్తుంది. పెద్దవారు ఇప్పటి నుండి బాలల్ని మెరుగ్గా సంరక్షింపవచ్చు! బాలలైన మమ్ము కొలమానాలు పాటించి వారు ఆదుకొంటారు.

మిత్రులారా: ఈనాడు సంరక్షకులు మన ప్రతిఒక్కరిని గుర్తించాలని, ఒక్కొక్కరి ప్రత్యేకతను గౌరవించాలని ఆహ్వానింపబడుతున్నారు. మన ఏకాంత వ్యక్తిత్వం గౌరవింపబడుతుంది. బాలలైన మనకు కనికరంతో క్రమశిక్షణ నేర్పిస్తారు. ఇక అధికారం ఉందని చెబుతూ పెద్దవారు తోచినట్టు మనతో వ్యవహరించరు. కారణములేకుండ చర్యలు తీసుకుంటానికి చోటులేదు. మనపట్ల సగౌరవంతో ప్రవర్తిస్తారు.

ఈ సంతోష భవిష్యత్తులో మన గతాన్ని పెద్దలు అర్థం చేసుకొంటారు. మనకిప్పుడవసరమైన సహాయం యిప్పిస్తారు. మనం కోల్పోయినవి తిరిగి పొందటానికి కావలసిన సహాయము ఇప్పుడు అందిస్తారు. కావలసినప్పుడు నిపుణులు సహాయము అందిస్తారు. బయటవారు, సందర్శకులు, స్వచ్ఛంద సేవకులు, సహకారుల ఎదుట మనలను ప్రదర్శన వస్తువులుగా వాడరు. మా జీవితంలోకి వారిని తొంగిచూడనివ్వరు. మా ఫోటోలనుపయోగించి యే విధంగాను మమ్ము దోపిడికి గురిచేయరు. మమ్ము గూర్చి సంభాషించేటప్పుడు, లేక సమాచారం తెల్పేటప్పుడు ఆంతరంగికత, సగౌరవనీయత పాటిస్తారు. మా లోపాలను, బలహీనతలను, అవమానములను గురించి అశ్రద్ధగా మాట్లాడరు. మా తరపున మా మేలు కోరుతూ వారు మాట్లాడతారు. మమ్ము గురించి తమలో తాము ప్రతికూలముగా తిరస్కారముగా మాట్లాడరు.

## 7. నియామకం, తర్ఫీదు, సామర్థ్యాల పెంపుదల

ఒకనాడు ఒక పంతులు నాతో, "ఈ చోట నువ్వుండ తగవు" అన్నాడు. ఇపుడు ఈ బాల విధానములో వ్రాయబడినది చదివితే నాకు నవ్వోస్తుంది. మనం బాలలమైతే చాలు; మనమిక్కడ ఉండతగిన వారమే. ఐతే పెద్దలు అందరు ఇక్కడ ఉండ తగకపోవచ్చు. కొందరు పెద్దలకు మనకు సంరక్షణ కల్పించే సామర్థ్యం లేదు, వారు మనపట్ల సగౌరవంగా ఉండి, ఈ బాల విధానాన్ని పాటించవలసి ఉంటుంది. లేనట్లయితే వారు యిక్కడ ఉండడానికిలేదు. ఇది నిజంగా గొప్ప తలంపు.

ఊహించండి: బాలలకు స్నేహితులైన వారిని మరియు బాలలను సంరక్షించేసామర్థ్యం గలవారు మాత్రమే నియమింపబడతారు. అలాగే నైపుణ్యంగలవారిని నియమిస్తారు. గతంలో బాలలను దుర్వినియోగ పరచినవారు యిక్కడ ఉండవీలుపడదు. మాతోపాటు పనిచేసేవారు, మా కొరకు పనిచేయ నియమింపబడినవారు శిక్షణ పొందుతారు. ఈ బాల విధానాన్ని వారు నేర్చుకుంటారు. బాలల హక్కుల సంభందించిన చట్టములు వారు తెలుసుకుంటారు. మాకు జీవనైపుణ్యాలు నేర్పించడానికి వారు శిక్షణ పొందుతారు.

బాల విధానాన్ని మా పెద్దలు అనుసరిస్తున్న తీరు గమనింపబడుతుంది మరియు సమీక్షింపబడుతుంది. ఈ బాల విధాన సమీక్షలో మా పాత్రను గురించి మేము ఎక్కడా చూడలేదు. కాని ముమ్ముందు మా పాత్ర ఉంటుందని మేమనుకుంటాము. పెద్దలు మాతోపాటు స్నేహంగా ఉన్నారా, లేదా అనేది మాకే కదా బాగా తెలిసేది?

## 8. సమాచార నిక్షిప్తం, పరిశోధన మరియు విధాన సమర్థన

సమస్యలలో ఉన్న మేము బలహీనులం, మాకు సహాయం అవసరం. మాలాగే చాలా మంది పిల్లలు కష్టమైన పరిస్థితిలో ఉన్నారు. మీరు అలాంటి పిల్లల వివరాలు సేకరించడానికి ప్రణాళిక తయారు చేస్తున్నారు. మీరు అందుబాటులో ఉన్న వివరాలను పొందుపరుస్తున్నారు. మాకు సంబంధించిన వివరాలు కూడ సేకరించబడిన ఖాతలో జమ అవుతాయి. మా వివరాలు రహస్యంగా ఉంచబడతాయి మరియు మా ఏకాంతం గౌరవింపబడుతుంది.

ఈ సేకరించిన విషయాల మీద మీరు అధ్యాయనం చేస్తారని మాకు అర్థమైంది. పిల్లల మంచికై మీరు రక్షణ పరమైన మరియు మార్పుతో కూడిన చర్యలు తీసుకోవాలనుకుంటున్నారు. మీరు పరిశోధన అని పిలవబడే దాని నుండి వచ్చిన వివరాలను అందరికి తెలియజేయవచ్చు. జనాలు మా ప్రస్తుత కష్టస్థితి గురించి చర్చమొదలు పెడతారు. అప్పుడు ఈ బాలవిధానం వేరేచోటల కూడా అనుసరించవచ్చు. వేరేచోట ఉన్న పిల్లలు కూడ జాగ్రత్తగా చూసుకోబడతారు.

ఈ ఉద్యమములో మేముకూడ పాలుపంచుకోబోతున్నాం. మా పిల్లలమే ఇతర పిల్లలకై మాట్లాడవచ్చు. మాకు మార్పు తెచ్చే విధానాలను తయారు చేయడంలో మేముకూడ సహాయం చేయవచ్చు. ఇది భలేగా ఉంది. పిల్లలు ప్రతిచోట సురక్షితంగా ఉండబోతున్నారు. అన్ని దేశాలు పిల్లల ఆప్త మిత్రువుగా మారేరోజు త్వరలో రాబోతుంది. ఈ మార్పులో మనం భాగస్వాములం.

## 9. బాలలకు వ్యతిరేక ప్రవర్తనలు: ఫిర్యాదులు, ప్రతిస్పందనలు

ఈ బాలవిధానానికి సంబందించి ఏది రాజీకి తీసుకోబడదు. ఈ విధానానికి సంబందించి ఆఖరి మరియు సవాలుతో కూడిన భాగం మిగిలి ఉంది. ఇకపై ఏ కేంద్రములోకూడ మమ్మల్ని దుర్వినియోగ పరచకుండా మీరు కచ్చితంగా చూస్తారు. మీరు వాస్తవ ఆలోచలనలు కలిగి ఉన్నారు. పిల్లలు తప్పు చేస్తారని మీకు తెలుసు. కొందరు పెద్దలు తొందరపాటుగా మాకు ఎలా శిక్షలు విధిస్తారో మీకు ఎరుకనే. ఇప్పుడు మీరు పెద్దలు కూడ తప్పుచేస్తారని ఒప్పుకుంటున్నారు. మీరు పెద్దలు చేసిన తప్పులకు వారిని బాధ్యులు చేయాలనుకుంటున్నారు. ఇకపై పెద్దలు ఈ కేంద్రాలలో పిల్లలను దుర్వినియోగ పరిస్తే వారిపై చర్యలు తీసుకుంటారు. దీనికి మీరు కచ్చితమైన విధానాలను తెలియపరుస్తున్నారు.

ఈ విధానంలో దుర్వినియోగం అనే భాగం చేర్చడం మాకు సంతోషంగా ఉంది. అయినప్పటికి మేము ప్రార్థిస్తున్నాము మరియు కోరుకుంటున్నాము. ఈ జగ్రత్తలను ఉపయోగించవలసిన అవసరం రాకూడదని. పెద్దలు చాలా సులువుగా మమ్మల్ని శిక్షించి లేక దుర్వినియోగ పరిచినప్పటికి మేము వారిని నిజంగా ప్రేమిస్తున్నాము. మా ఉనికికి మరియు మేము ఇలా ఉండటానికి కారణం పెద్దవారు. మా బ్రతుకు తెరువుకి, ఎదుగుదలకి, సంరక్షణకి మరియు పాలుపంచుకోవడానికి మాకు పెద్దల పదిలమైన ప్రేమ అవసరం.

## 10. ముగింపు

మనం చివరికి చేరుకున్నాం. మరోవిధంగా చెప్పాలంటే మనం ఓ కొత్తతరం జీవితం ప్రారంభించబోతున్నాం, ఇప్పుడు అన్నిటికి కేంద్రబింధువు మేమే. మాకు విలువనిచ్చె ఈ విధానాన్ని చూస్తుంటే మాకు చాలా ఆనందంగా ఉంది. మీరు మాపై ఆసక్తి చూపుతున్నారని మాకు అర్థమౌతుంది. మేము ఆనందంగా పెరగాలని కోరుకుంటున్నారు. మేము మిమ్మల్ని నమ్మాలి అని ఎదురుచూస్తున్నాం. మిమ్మల్ని ఇంకా నమ్మనందుకు మమ్మల్ని క్షమించండి. మా గత అనుభవం మాలో నమ్మకాన్ని ప్రేరేపించడం లేదు. మేము మిమ్ము నమ్మినప్పుడు, మేము అన్ని బాగా చేయగలుగుతాము. మేము మిమ్మల్ని నమ్మినప్పుడు, మేము మమ్మల్ని కూడా నమ్మగలుగుతాము. మిమ్మల్ని నమ్మడానికి సహాయం చేయండి. అప్పుడు ఇరువురం సంతోషంగా ఉంటాము.